తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## కారు ఢీకొని భర్త మృతి .. భార్యకు తీవ్ర గాయాలు



చంద్రగిరి, డిసెంబర్ 23 ప్రభాతవార్త

కారు ఢీకొని భర్త మృతి చెందగా, భార్య తీవ్ర గాయాలపాలైన విచారకర దుర్ఘటన సోమవారం కోదండ రామాపురం వద్ద చోటుచేసుకున్నది. తిరుచానూరుకు చెందిన బాలాజీ, మాదవి దంపతులు చిత్తూరు నుండి తిరుచానూరుకు వస్తుండగా కోదండ రామాపురం వద్ద వెనుక నుండి వచ్చిన కారు వేగంగా ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై వస్తున్న బాలాజీ ఒక్కఉదుటున ఎగిరి రోడ్డుపై పడి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో బాలాజీ వెనుక కూర్చున్న మాదవి తీవ్రగాయాలపాలైయ్యింది. అయితే ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా పారిపోయి ఐతేపల్లి వద్ద గల పెట్రోల్ బంకులో కారును వదలి నిందితుడు పరారైనట్లు తెలిసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మలివిడత జనవరి 7న స్థానికులకు గోవిందుని దర్శనం

### -జనవరి 5న టోకెన్లు జారీ

తిరుమల,డిసెంబర్ 23ప్రభాతవార్తప్రతినిధి:



తిరుమల, తిరుపతి నగరం, రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాల్లోని స్థానికులకు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనభాగ్యం రెండవవిడత జనవరి 7వతేదీ కల్పిస్తున్నారు. ఇందుకోసం జనవరి 5వతేదీ ఆదివారం ఉదయం తిరుపతి మహతి ఆడిటోరియంలోని కౌంటర్లలో, తిరుమలలోని కౌంటర్‌లో ఉచిత టోకెన్లు జారీ చేస్తారు. టోకెన్లు తీసుకున్న భక్తులకు జనవరి 7వతేదీ మంగళవారం ఉదయం స్థానికులకు గోవిందుని దర్శనం కల్పిస్తారు. ఈ దర్శనానికి స్థానికుల కోటా క్రింద ఆధార్‌కార్డు ఆధారంగా ఉచిత దర్శన టోకెన్లను టిటిడి జారీ చేస్తోంది. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని టిటిడి తెలిపింది. స్థానికులకు రెండవ నెలలో రెండవ విడతగా కల్పిస్తున్న దర్శనం.

### శ్రీకాళహస్తీశ్వరాలయంలో

## మెయిన్‌గేట్ ప్రవేశానికి స్వస్తి

### స్కానింగ్‌తోనే ప్రవేశం : ప్రయోగాత్మకంగా ఆచరణ: ఇఓ



శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొత్తగా స్కానర్ సెంటర్ ఏర్పాటు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని ఆదాయాలు గండికొడుతున్న విధానాలపై ఇఓ టి.బాపిరెడ్డి యుద్ధం సాగిస్తున్నారు. దళారులకు చెక్‌పెట్టడానికి శివయ్య ఆదాయాలను పెంచుకొనుటకు ఎన్ని ప్రయోగాలు చేయాలో అన్ని ఆచరిస్తున్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఇఓ టి.బాపిరెడ్డి మొదటి నుంచి దళారులు,అక్రమార్కులపై దృష్టి సారించారు.ఈ నేపథ్యంలో కార్తీకమాసంలో ఒక్కనెలలోనే గత ఏడాదితో పోల్చుకుంటే రూ.కోటి ఆదా అయ్యింది.అదనపు ఆదాయం సమకూరింది. ఓ వైపు భక్తులకు సదుపాయాలు మరో వైపు సంస్కరణలను చేపడుతున్నారు.ఈ నేపథ్యంలో సోమవారం మరో కొత్త ప్రయోగం చేశారు.గతంలో రూ.200ల ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తుల్ని రాజమార్గంగా విజయస్థంభ ఎదురు నుంచి ప్రవేశం కల్పించే వారు. అయితే సోమవారం ఆ విధానాలకు కూడా స్వస్తి చెప్పారు.ఎవ్వరైనా మూడు,నాలుగవ గేటు నుంచి విఐపిలకు మరో కౌంటర్, పిఆర్ఓ కార్యాలయం నుంచి వచ్చిన వారిని ప్రత్యేక ప్రవేశంగా విజయస్థంభం నుంచి అనుమతించే వారు. అక్కడ గేటు తీసినపుడు పలుకు బడి కల్గిన వారు దళారులు సమయంకోసం వేచి ఉంటూ లోపలకు తీసుకెళ్ళె వారు.ఈ మాయను గుర్తించిన ఇఓ టి.బాపిరెడ్డి సోమవారం మరో ప్రయోగానికి తెర తీసారు.దాంతో ఆలయం రాబడిపైనే దృష్టిపెట్టిన దళారులకు చెక్ పడింది. ఇక పిఆర్ఓ కార్యాలయం నుంచి వచ్చిన వారు కూడా 16కాళ్ళ మండపం పొగడ మాను మధ్య ఉన్న నాలుగు కాళ్ళ మండపంలో 'స్కానింగ్ సెంటర్'ను ఏర్పాటు చేసారు.టిక్కెట్లు కొనుగోలు చేసినవారు ఎవ్వరైనా సరే స్కానింగ్ చేసుకొని వెళ్ళాల్సిందే.దీని వల్ల ఎవరు టిక్కెట్లు కొనుగోలు చేస్తున్నారు?ఎవరు ఉచితంగా ప్రవేశిస్తున్నారు? అనే వివరాలు దేవస్థానంకు తెలిసినట్లు ఉంటుంది.దీని వల్ల దళారులను కట్టడి చేయటమే కాకుండా పిఆర్ఓ కార్యాలయం నుంచి ఎంత మంది విఐపిలు పాస్‌లు తీసుకుంటున్నారు. ఎంత మంది విఐపిల ముసుగులో పాస్‌లతో ప్రవేశిస్తున్నారనే అంశాలను గుర్తించటానికి వీలుగా ఉంటుంది. ఆలయ ఇఓగా బాపిరెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆలయ ఆదాయాలపైనే దృష్టి పెట్టారు.

### మారని ఎమ్మెల్యే తీరుపై

## తెలుగుతమ్ముళ్ళ ఆగ్రహం

### అధినేత చంద్రబాబు వద్దే తేల్చుకోవాలని నిర్ణయం
### ఆరణిపై అసంతృప్తి సెగలు

**"ఏరు దాటేవరకు ఓడ మల్లన్న-ఏరు దాటాక బోడిమల్లన్న"అనే రీతిలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆయన అనుచరుల వ్యవహారం తయారైందని తెలుగుదేశం పార్టీ నేతలు కస్సుమంటున్నారు. తన సొంత పార్టీ అయిన జనసేన నేతలు ఎవరు? ఏమిటీ అని కూడా తెలుసుకోకుండా తిరుపతిలోని పలు కీలక శాఖల నామినేటెడ్ పదవులకు పేర్లు సిఫార్సుచేయడమే ఇప్పుడు కూటమిపార్టీల్లోని టిడిపి, బిజెపి నేతలు ఆగ్రహం వెలిబుస్తున్నారు.**

ప్రభాతవార్త-తిరుపతి:

చిత్తూరుకు చెందిన ఆరణి శ్రీనివాసులును గత సార్వత్రిక ఎన్నికల్లో ఏకంగా తిరుపతికి తీసుకువచ్చి జనసేన పార్టీతరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన కూటమి నేతలు ఆయన గెలుపుకు సహకరించాలని హితవు చేశారు. ఎన్నికల సమయంలో తొలుత స్థానికులను కాదని బయటినుండి నాయకుడ్ని తీసుకురావడం పట్ల అటు జనసేనపార్టీతోబాటు ఇటు తెలుగుదేశంపార్టీలో అదే సామాజిక వర్గంకు చెందిన వాళ్ళు అంగీకరించలేదు. తొలిరోజుల్లో కొంతవరకు ఆయనకు సహాయనిరాకరణ కూడా ప్రకటించారు. అయితే తిరుపతిలో తెలుగుదేశం పార్టీలో నేతల మధ్య ఐక్యత లేకపోవడం, పార్టీకేడర్ నాయకులు పదవులతోసరిపెట్టుకుని పార్టీని బలోపేతం చేసుకోలేకపోవడంతో జనసేనపార్టీ తరపున తిరుపతిలో టిక్కెట్ కేటాయించాల్సిన పరిస్థితి వచ్చిందని తెలుగుదేశం వర్గాల్లో హాట్ టాపిక్ అయ్యింది. తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు, యువనేత నారాలోకేశ్‌తోబాటు జనసేనాని పవన్‌కల్యాణ్ కూడా తిరుపతి నేతలతో స్వయంగా మాట్లాడి సమన్వయం చేశారు. ఎన్నికల్లో టిడిపి కేడర్, నేతలు గట్టిగా పనిచేసి ఆరణిని గెలిపిస్తే ఎంఎల్‌సి తోబాటు నామినేటెడ్ పదవులను కట్టబెడతానని అధినేత ,ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుపతి నేతలకు హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని స్థానిక నేతలందరూ గుర్తుచేసుకుంటున్నారు. ఎన్నికల్లో తిరుపతి ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసుల్ని



గెలిపించుకోవడం జరిగింది. నెలరోజులు కావస్తుండటంతో ఇప్పుడు నామినేటెడ్ పదవులు పందేరంపై కూటమిలోని జనసేన,టిడిపి, బిజెపి నేతలు దృష్టి సారించారు. ముఖ్యంగా తిరుపతిలో తుడ ఛైర్మన్, పాలకమండలి,రుయా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఆస్పత్రుల అభివృద్ధి సంక్షేమ కమిటీ ఛైర్మన్ పదవులు, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్, డైరెక్టర్ పదవులు, కులసంఘాల బోర్డుల ఛైర్మన్‌లు, డైరెక్టర్ పదవులు, పాఠశాల కమిటీలు, విద్యాభివృద్ధి కమిటీల్లో పదవులు, టిటిడి బోర్డులో సభ్యత్వం, స్థానిక ఆలయాల పాలకమండళ్ళలో ఛైర్మన్, సభ్యుల పదవులు వంటివాటిపై తెలుగుదేశం పార్టీ నేతలు, సీనియర్ నేతలు దృష్టి పెట్టారు. అయితే ఈ పదవుల పంపకంపై స్థానిక ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసులు ఏకపక్షదోరణితో వ్యవహరిస్తున్నారని, ఎన్నికల్లో గెలుపుకు కష్టపడి పనిచేసిన వారిని కాదని తనకిష్టమొచ్చిన వారిని ఎంపికచేసేలా ఆయన ధోరణి మారిందనే ఆవేదన తెలుగుదేశంపార్టీ,బిజెపినేతల్లో వ్యక్తమవుతోంది.

నలభైఏళ్ళ సుదీర్ఘచరిత్ర ఉన్న తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకులు, ద్వితీయశ్రేణి నాయకులు పార్టీని నమ్ముకుని ఉన్నవాళ్ళను కలుపుకుని పోవడంలో ఎమ్మెల్యేగా ఆయన వ్యవహారం మారలేదనేది బహిరంగంగా వినిపిస్తున్న విమర్శలు. కొంత మందిని మాత్రమే కలసి తనశైలిలో వెళ్ళిపోతున్నాడనే లుకలుకలు లేకపోలేదు. ఇప్పుడు నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న కూటమి పార్టీలో నేతలు ఎమ్మెల్యే ఆరణి తీరుపై బహిరంగంగానే తిరుగుబాటు జెండా ఎగురవేసే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ పంచాయితీ ఏకంగా తమ అధినేత చంద్రబాబు వద్దే తేల్చుకుంటామని కొందరు నేతలు వ్యాఖ్యానిస్తుండటం కొసమెరుపు.

### చియ్యవరంకు

## స్త్రీనిధి ప్రత్యేక బృందం రాక

### -రూ.2.16 దుర్వినియోగం అని తేల్చిన సభ్యులు




తొట్టంబేడు, డిసెంబర్ 23 ప్రభాతవర్తా

వెలుగులో అవినీతి చీకట్లు మాయమయ్యేనా అన్న శీర్షికన వార్త ప్రచురితం కావడంతో సోమవారం స్త్రీనిధి ప్రత్యేక బృందం అధికారులు గ్రామానికి విచ్చేశారు. ఈసందర్భంగా చియ్యవరంలో గతంలో పనిచేస్తున్న సంఘమిత్రలు, బ్యాంకు మరియు స్త్రీనిధి రుణాలు సభ్యులు వద్ద కట్టించి బ్యాంకుకు జమచేయడం లేదని ఆరోపణలు రావడంతో అప్పట్లో వెలుగుపిడి విచారణ కమిటీని వేసఇ గ్రామంలో విచారణ చేసి ఇద్దరు సంఘమిత్రలను తొలగించిన విషయం తెలిసిందే. వీరిద్దరు కలసి రూ.2.16కోట్లు నిధులు దుర్వినియోగం చేశారు. అయితే ఇప్పటి వరకు కేవలం రూ.54లక్షలే వారు చెల్లించినట్లు విచారణాధికారులు తెలిపారు. ఈసందర్భంగా స్త్రీనిధి రుణాల్లో ఇంకా సుమారు రూ.13 దుర్వినియోగం అయినట్లు తెలిసిందన్నారు. ఇందుకు మహిళలు నిధులు దుర్వినియోగం చేసిన మాజీ సంఘమిత్రలపై చర్యలు తీసుకోవాలని కోరగా విచారణ నివేదికపై అధికారులకు పంపించామని గ్రామసంఘం బైలా విచారణ నివేదికపై అధికారులకు పంపామని దీని ప్రకారం గ్రామ సంఘం సిబ్బందిపై చర్యలు తీసుకునే అధికారం గ్రామ సంఘం సభ్యులకే ఉంటుంది కాబట్టి వారికి ఇచ్చిన గడువు లోపు రికవరీ చెల్లించకపోవడంతో గ్రామ సంఘం వారే పోలీసులకు పిర్యాదు చేసే అధికారం ఉన్నందున ఆప్రకారం చర్యలు తీసుకోవాలని తెలపడంతో గ్రామస్తులు అంగీకరించారు. సిబ్బంది తోడ్పాటు లేకుండా ఇంత పెద్దమొత్తంలో నిధులు సంఘమిత్రలు స్వాహాచేయడంతో పాటు సిసిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి ఎజిఎంలు హేమంత్ కుమార్, మునిరత్నం, తొట్టంబేడు ఎపిఎం ఇందిరాగాంధీ, స్త్రీనిధి మేనేజర్లు వనజ, మురళీకృష్ణ, మల్లేశ్వరయ్య, స్థానిక నాయకులు కృష్ణయ్య, వెంకటరమణ, రాజనాల, పెంచలయ్య, అలంకార్ తదితరులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారంపై

## ప్రత్యేక దృష్టి

### - అధికారులను ఆదేశించిన కలెక్టర్ సుమిత్‌కుమార్



ప్రజల నుండి సమస్యలపై వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, డిసెంబర్ 23 ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను స్వీకరించి క్షేత్ర స్థాయిలో సమస్యలకు సంబంధించి వాస్తవ పరిస్థితులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల నుండి సమస్యలపై అందిన ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతి వారం సమీక్షించడం జరుగుతుందని, అర్జీలు రీ-ఓపెన్ అయితే వాటికి గల కారణాలను అధికారులు వివరించాల్సి వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 178 సమస్యలు**

కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవంలోని గ్రీవెన్స్‌హాలులో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు సమస్యలపై 178 అర్జీలను కలెక్టర్‌కు అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 145 అర్జీలు అందగా, పోలీసు శాఖ 5, పంచాయతీరాజ్ 3, పశుసంవర్ధకశాఖ 5, హౌసింగ్‌కు సంబంధించి 3 సమస్యలు అందాయి.

### జూనియర్ కాలేజి క్రీడా ప్రాంగణానికి

## పండుగ శోభ

### - ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, డిసెంబర్ 23 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణంలోని జూనియర్ కాలేజి క్రీడా ప్రాంగణానికి ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా పండుగ శోభ తీసుకొచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం ఆమె జూనియర్ కాలేజి క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడా ప్రాంగణంలో లెవలింగ్, మరుగుదొడ్లు మరమ్మతులు, విద్యుద్దీపాలు ఏర్పాటు తదితర అంశాలపై చర్యలు తీసుకొని వాటన్నింటినీ త్వరితగతిన ఏర్పాటు చేసి పక్షుల పండక్కి వచ్చే సందర్శకులకు మౌలిక సదుపాయాలను కల్పించే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఇప్పటికే ఇందుకు అవసరమైన నిధులకు సంబంధించి నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపి ఉన్నారన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ఈ పనులను ప్రారంభిస్తామన్నారు. కాలేజి ప్రాంగణంలో వాకింగ్ ట్రాక్ పరిశుభ్రంగా తీర్చిదిద్ది వాకర్స్‌ను అనుకూలంగా ఏర్పాటు చేస్తామన్నారు. క్రీడా ప్రాంగణంలో వర్షం వస్తే మోకాటి లోతు నీరు నిలిచిపోతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని అండర్ డ్రైనేజి సిస్టం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తామని తెలిపారు. ప్రజలందరి సహకారంతో జనవరి 10, 11, 12 తేదీలలో నిర్వహించనున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌ను విజయవంతం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, కొక్కు శంకరయ్య, మేడా సాయినారాయణ, పచ్చా మాధవనాయుడు, అలవల శ్రీనివాసరావు, గుర్రం ప్రసాద్, లింగం వెంకటకొండయ్య, బండారు ఆంజనేయులు, ప్రిన్సిపాల్ శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అటు ప్రజలతో మమేకం..

## ఇటు అభివృద్ధికి భరోసా ఇస్తూ ..

### నారా భువనమ్మ కుప్పం టూర్ సక్సెస్ !!



రామకుప్పం గురుకులంలో పిల్లలతో కలసి సహపంక్తి భోజనం చేస్తున్న నారా భువనేశ్వరి

కుప్పం, డిసెంబర్ 23 ప్రభాతవార్త

నేను సిఎం భార్యగా కుప్పానికి రాలేదు.. ఓ కార్యకర్తగా వచ్చా.. కుప్పం ప్రజల అభివృద్ధి మా బాధ్యత.. కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటాం .. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వంతో పాటు ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున చేయూతనందించి ఆదుకుంటాం.. కుప్పానికే పరిశ్రమలు వస్తాయి.. మీ కళ్లముందే మీ పిల్లలు ఉద్యోగాలు చేస్తారు.. ప్రతి మూడు నెలలకు ఓసారి కుప్పం వచ్చి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తా అంటూ సిఎం చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజి ంగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం ప్రజలకు భరోసా కల్పించారు. తన నాలుగు రోజుల పర్యటనలో భాగంగా కుప్పం అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. అతివలు, యువతలో ఆత్మస్థైర్యం నింపారు. కుప్పంలో భువనమ్మ టూర్ సక్సెస్ అయింది. గ్రామ గ్రామాన నారా భువనమ్మకు మహిళా లోకం నీరాజనం పలికారు. కుప్పం, రామకుప్పం మండలాల్లోని సుదూర అటవీ ప్రాంతాల్లో సైతం ఆమె రెట్టించిన ఉత్సాహంతో పర్యటించి అక్కడి ప్రజలు, మహిళలతో మమేకమయ్యారు. సిఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేస్తారని కుప్పాన్ని రానున్న ఐదేళ్లలో ఆదర్శంగా చేస్తామని నారా భువనమ్మ భరోసా ఇచ్చారు. కుప్పంకు ఇదివరకే సిఎం చంద్రబాబు ప్రకటించిన నలభై కార్యక్రమాలతో పాటు గ్రామాల సంపూర్ణ అభివృద్ధికి సిఎం చంద్రబాబు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తారని వెల్లడించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు అర్హులకు పక్కా ఇళ్లు, పెన్షన్లు, రేషన్‌కార్డులు అందిస్తామని పేర్కొన్నారు. ప్రజల సాధక బాధలను ఆమె నేరుగా అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికై నేతలకు సూచనలు చేశారు. కుప్పాన్ని దేశంలోనే ఆదర్శంగా చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. మరో పక్క సిఎం చంద్రబాబు అక్రమ అరెస్ట్ తర్వాత తమకు మహిళలు అండగా నిలిచారని, నిజ ం గెలవాలి యాత్రలో కార్యకర్తలు, ప్రజలకష్టాలు తాను నేరుగా తెలుసుకున్నానని పేర్కొన్నారు. వైకాపా అరాచక పాలనపై వివరించారు. తమపై విశ్వాసం ఉంచిన ప్రజలు, మహిళలు, కార్యకర్తలకు అండగా నిలవాలని తాను నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. మరో పక్క విద్యార్థి లోకానికి సైతం తగు సలహాలు, సూచనలు అందించారు.

## మఠం భూముల అక్రమార్కులకు అడ్డుకట్ట వేయండి

### రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యేకి భూ బాధితుల మొర

తిరుపతిరూరల్, డిసెంబర్ 23 ప్రభాతవార్త:

ప్రజా అవసరాలను విస్మరించి...కాంట్రాక్టర్లకు, నాయకులకు లబ్ది చేకూర్చారని...గత పాలకుల పాపాల పుట్టను వెలికితీయాలని స్థానికులు ఎమ్మెల్యే పులివర్తి నానిని కోరారు. సోమవారం తిరుపతిరూరల్ మండలం తుమ్మలగుంట గ్రామ పంచాయతీలో 'రెవెన్యూ సదస్సు' నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ రైతులు భూ సమస్యలు పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగకుండా అధికారులే ప్రజల వద్దకు వచ్చి, భూ సమస్యలు పరిష్కరించుటకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తెలిపారు. గత వైసిపి పాలనలో జరిగిన భూ అక్రమాలు, అన్యాయాలను వెలుగులోకి తీయటానికే ' మీ భూమి-మీ హక్కు' కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. మఠం భూములు కొనుగోలు చేసి మోసపోయామని, న్యాయం చేయాలని మఠం భూములలో ఇండ్లప్లాట్స్ కొనుగోలు చేసిన బాధితులు ఎమ్మెల్యేకి . తుమ్మలగుంట చెఱువు, వంకపోరంబోకు కాల్వలను యధాస్థితికి తీసుకురావాలని స్థానికులు కోరారు. దళితవాడలో రోడ్ల పరిస్థితి అధ్వన్నంగా ఉన్నాయని, మురుగుకాల్వలు సరిగా లేవని, పలుమార్లు విన్నవించిన అధికారులు పట్టించుకోలేదని దళితులు ఆవేదన వ్యక్తం చేసారు. గత వైసిపి ప్రభుత్వంలో అర్హులకు ఇండ్లు మంజూరు చేయలేదన్నారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో ఏ1 రిజిస్ట్రార్/పెయిర్ అడంగల్, వెబ్‌ల్యాండ్ అడంగల్, మాన్యువల్ అడంగల్, 10(1) రిజిస్ట్రార్, 22(ఎ) రిజిస్ట్రార్స్, ఆర్ఓఆర్-1, ఆర్ఓఆర్-1బి, హౌస్ సైట్ రిజిస్ట్రార్, కోర్టు కేసుల వివరాలను తెలుసుకోవడంతో పాటు కొన్ని రెవెన్యూ సమస్యలను రెవెన్యూ



సదస్సులో పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. తుమ్మలగుంటలో స్కూల్ భవనాలు అన్యాక్రాంతమైనాయని, వాటిని గుర్తించి ఆధునీకరించాలన్నారు. చెఱువులో నూతన స్కూల్స్ నిర్మాణమైందని, అందులో తరగతి గదులు నిర్వహించుకోవచ్చా అని ప్రధాన ఉపాధ్యాయరాలు కోరగా, ఆ విషయంపై నేను ప్రస్తావించను...జనవరిలో విద్యాశాఖ మంత్రి పర్యటన ఉందని, అన్యాక్రాంతమైన స్కూల్స్‌ను అధీనంలోకి తీసుకోవాలని సూచించారు. అనంతరం స్థానికుల పిలుపు మేరకు తుమ్మలగుంటలో సుడిగాలి పర్యటన చేసారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, టిడిపి నేతలు దొడ్ల కరుణాకర్‌రెడ్డి, బిరుదాల భాస్కర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వేమూరు మధు, శ్రీధర్‌నాయుడు, నాగూరు శ్రీనివాసులు, అవిలాల సుధాకర్, బాలచంద్రారెడ్డి, దుర్గసముద్రం మునిశేఖర్, కాయం వెంకటేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి లేక ఆటకెక్కిన పారిశుద్ధం

వరదయ్యపాలెం, డిసెంబర్ 23, ప్రభాతవార్త

సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం మండలం కేంద్ర కార్యాలయాలు ఉన్న ఇందిరానగర్ పంచాయతీకి కొంతకాలంగా పంచాయతీ కార్యదర్శి లేక ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని రోడ్డుపై డ్రైనేజీ నీరు పోతున్న అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రతినిత్యం అదే మార్గాన ప్రజలు పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఆ మార్గం కుండానే వెళ్లాలి అయితే రోడ్డుకి ఇరువైపులా డ్రైనేజీ నీరు ప్రవహించడంతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్న స్థానిక ప్రజలు అనేక మాటలు ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం మాత్రం శూన్యమే అని ప్రజలు వాపోతున్నారు. చెత్త నుండి సంపద సృష్టించాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరు గారిపోతుంది. కొన్ని వీధుల్లో వీధి దీపాలు వెలుగ లేదు. మహిళా సచివాలయ సిబ్బంది బాత్రూములు డోర్లు లేకపోవడంతో బాత్రూంలో అరవ కురవ వసతులు ఉండడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఇందిరానగర్ పంచాయతీకి కార్యదర్శిని నియమించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై ఇంచార్జ్ ఎంపీడీవో ప్రసాద్ వివరణ కోరగా కాంట్రాక్టర్‌కు బిల్లులు పెండింగ్ ఉన్నందువలన అతను తాళాలు అప్పచెప్పలేదు అని తెలిపారు.

## ప్రజా పరిష్కార వేదికకు 32 వినతులు

అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 23, ప్రభాతవార్త

తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 32 వినతులు వచ్చాయని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుమారు 32 మంది వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతులు అందించారు. అందులో ముఖ్యంగా కొర్లగుంట నందు డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని, ప్రజలకు వైద్య పరీక్షలు చేయించాలని కోరారు, ప్రభుత్వ ఇంటి కొరకు దరఖాస్తు చేసుకున్నామని, ఆ నగదు ఇప్పించాలని, రోడ్డు విస్తరణకు తమ స్థలం తీసుకున్నారని టి.డి.ఆర్. బాండ్లు ఇప్పించాలని, ఓ వ్యక్తి డి.కె.టి. స్థలంలోని కాలువపై అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నారని ఆపు చేయాలని, సుబ్బారెడ్డి నగర్ నందు డ్రెయినేజీ కాలువ కొరకు తవ్విన గుంత పూడ్చాలని, గొల్లవాని గుంట, రాజీవ్ నగర్ నందు డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని, గరుడ వారధి పిల్లర్ 24 వద్ద గుంత పూడ్చాలని, పాత రేణిగుంట రోడ్డు రిలయన్స్ మార్ట్ వద్ద చెత్త వేస్తున్నారని నివారించి శుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, రవి, వెటర్నరీ డాక్టర్ నాగేంద్ర, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, డిఈలు, ఏసిపిలు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతలు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుంది

తొట్టంబేడు, డిసెంబర్ 23 ప్రభాతవార్త



అన్నదాతలు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతోందని మండలంలోని శ్రీచైతన్య-3 బ్రాంచి పాఠశాల ప్రిన్సిపల్ నిరోష తెలిపారు. సోమవారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రైతులకు పాఠశాల విద్యార్థులచే సత్కరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ నిరోషా మాట్లాడుతూ రైతులే దేశానికి వెన్నెముక అని వారు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. వారు లేకపోతే ప్రజలకు బువ్వలేదన్నారు. అన్నదాతలు నేలతల్లిని నమ్ముకుని పంటలను పండిస్తున్నారని వారికి ప్రభుత్వం చేయూత నివ్వాలన్నారు. నేడు రైతులు వరి, వేరుశనగ పంటలు పండిస్తారని విద్యార్థులకు పంటలు ఎలా పండిస్తారో వారికి వివరించారు. అనంతరం రైతులను సత్కరించారు. కార్యక్రమంలో ఏజిఎం సురేష్, డీన్ సురేంద్ర, ఇన్‌ఛార్జి రమేష్, సోనియా, విద్యార్థులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## బొజ్జల రక్తంలో నిర్లక్ష్యానికి చోటులేదు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 23 ప్రభాతవార్త



గత వైసిపి ప్రభుత్వం అరాచకాలను ఎదుర్కొవడానికి తెలుగుదేశంపార్టీ నియోజకవర్గంలో చేపట్టిన ప్రతి ఒక్క కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించిన ఎంఎల్ఏ బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి రక్తంలో నిర్లక్ష్యానికి చోటులేదని తెలుగుదేశంపార్టీ బిసి నాయకులు తెలిపారు. ఈసందర్భంగా బిసి నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ నియోజకవర్గంలో రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసి అధికారాన్ని అడ్డపెట్టుకుని మాజీ ఎంఎల్ఏ బియ్యపుమధుసూధనరెడ్డి సాగించిన అకృత్యాలను, ఆగడాలను ఎదిరించి బాధిత ప్రజలకు అండగా నిలబడి తెలుగుదేశంపార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ పోరాడిన ప్రతిపక్షనాయకుడు నేటి ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి ప్రజలపట్ల కానీ, తెలుగుదేశంపార్టీ కుటుంబసభ్యుల పట్ల కానీ ఏనాడు నిర్లక్ష్యం చూపరన్నారు. మాజీ ఎంఎల్ఏ మధు అనుచరుల మోసాలకు బలైన బాధిత కుటుంబాలకు అధికారంలోకి వచ్చిన వెంటనే బాసటగా నిలిచి చట్టపరిధిలో అవసరమైన చర్యలు తీసుకోవడానికి యంత్రాంగానికి తగిన సూచనలు చేస్తున్న సుధీర్‌రెడ్డి ఎన్నటికి ప్రజల పక్షమే అన్నారు. సమావేశంలో మిన్నల్‌రవి, ఉమేష్‌రావు, బుజ్జి,చంద్రశేఖర్,కుమార్,భాస్కర్, మణి, చాంద్‌బాషా, నూర్‌మహ్మద్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ గారూ... మాకు ఆరోగ్య బిక్ష పెట్టండి ...!

- కొండా రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు విజ్ఞప్తి

తిరుపతి కలెక్టరేట్, డిసెంబరు 23 ప్రభాతవార్త :



కలెక్టర్ గారూ..తిరుపతి గిరిపురంలోని అపార్ట్‌మెంట్‌లో కాపురం ఉంటున్న రాజారెడ్డి నుంచి అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న 33 కుటుంబాలకు ఆరోగ్య బిక్ష పెట్టాలని కొండా రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు మునికృష్ణమనాయుడు, షంషేర్ సయ్యద్ పి. నాగరాజు, ఎస్. రాజు, ఎస్. జగదాంబ, పసుపులేటి రవిశంకర్ పలువురు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు ఓ వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ అపార్ట్‌మెంట్‌లో కాపురం ఉంటున్న కమలాపురం రాజారెడ్డి అపార్ట్‌మెంట్ ముందు సిమెంటు షాపు పెట్టుకుని అపార్ట్‌మెంట్‌కు వెళ్ళే గేట్ వద్దనే సిమెంట్ లోడింగ్ అన్‌లోడింగ్ చేస్తున్నారని, దీని వలన అపార్ట్‌మెంట్‌లో జీవిస్తున్న ప్రజలు నిత్యం పొల్యూషన్ ఏర్పడి ఊపిరితిత్తుల వ్యాధి, పలు రకాల జబ్బులకు గురై ఆస్పత్రి పాలవుతున్నారని బాధపడ్డారు. షాపును అక్కడ నుంచి వేరే చోటుకు మార్పు చేయడంతో పాటు కొన్ని కుటుంబాల నుంచి తీసుకున్న డబ్బులను తిరిగి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా శ్రీ అయ్యప్పస్వామి ఉత్తర మహోత్సవం



కుప్పంరూరల్, డిసెంబర్ 23 ప్రభాతవార్త కుప్పం పట్టణం పాతపేటలోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో సోమవారం శ్రీ అయ్యప్పస్వామి ఉత్తర మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ వినాయకస్వామి, శ్రీ సుబ్రమణ్యస్వామి, శ్రీ అయ్యప్పస్వామికి ప్రత్యేక అభిషేకాలు, మంగళహారతులు జరిపారు. మధ్యాహ్నం అయ్యప్ప భక్తుల భజన కార్యక్రమం, అన్నదానం, రాత్రి అయ్యప్పస్వామి అష్టోత్తర నామాలతో పుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

శాంతిపురం, డిసెంబర్ 23 ప్రభాతవార్త



భూ సమస్యల పరిష్కారంకే సిఎం చంద్రబాబునాయుడు అధికారులతో రెవెన్యూ సదస్సులు నిర్వహి స్తున్నారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొలమ డుగులో తహశీల్దార్ శివయ్య అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. గౌనివారి మాట్లాడుతూ వైకాపా పాలనలో జరిపిన రీసర్వేతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వం రైతుల భూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, నేతలు పాల్గొన్నారు.

## పిఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వి.కోట, డిసెంబర్ 23 ప్రభాతవార్త



ఇంటింటికీ సౌర విద్యుత్ అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సిఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో డిఇ చిన్నప్ప పేర్కొన్నారు. సోమవారం వి.కోటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్లలోపు వాడుకునే ఎస్సీ,ఎస్టీ లబ్దిదారులకు ఉచితంగా విద్యుత్ అందిస్తోందన్నారు. అలాగే ప్రజలు సూర్యఘర్ పథకం ద్వారా కేంద్రం యూనిట్‌ను బట్టి రాయితీలు అందిస్తోందన్నారు. ఈ పథకంలో మిగులు విద్యుత్ సైతం విక్రయించుకునే అవకాశం ఉందన్నారు. ఎస్సీ,ఎస్టీ లబ్దిదారులు డిసెంబర్ 29లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఇ రామకృష్ణ, లైన్‌మెన్ శివకుమార్ పాల్గొన్నారు.

## రైతు క్షేమమే దేశ సంక్షేమం : బ్యాంకు రెడ్డెప్ప

చౌడేపల్లి, డిసెంబర్ 23 ప్రభాతవార్త



రైతులు క్షేమంగా వున్నప్పుడే దేశం సంక్షేమంగా ఉంటుందని ఎపి సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగస్తుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బ్యాంకు రెడ్డెప్ప అన్నారు. సోమవారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రాష్ట్ర, జిల్లా నాయకులు పిలుపు మేరకు సహకార బ్యాంకుల డిపాజిట్ సేకరణా కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుల సంక్షేమం కోసం సహకార బ్యాంకు పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. రైతులకు బ్యాంకు సేవలను వివరించారు. బ్యాంకు మేనేజర్ నాగవేణి, సూ పర్‌వైజర్లు ఆదిమోహన్‌రెడ్డి, విజయభాస్కర్, గీత, రైతులు పాల్గొన్నారు.

## రెవిన్యూ అధికారులచే అక్రమ కంచె ధ్వంసం

దిగువపల్లి(చౌడేపల్లి), డిసెంబర్ 23 ప్రభాతవార్త



ప్రభుత్వ భూమిలో అక్రమంగా వేసుకొన్న కంచెను రెవిన్యూ అధికారులు ధ్వంసం చేసిన సంఘటన సోమవారం చోటు చేసుకొంది. మండలంలోని దిగువపల్లి పంచాయతీ మోట్లపల్లి వద్ద 1.25ఎకరాల ప్రభుత్వ భూమి వుంది. ఆ స్థలాన్ని పక్కనే వున్న సర్వేనంబర్ 477-1లోని 1.36ఎకరాల డికెటి భూమివున్న కొందరు ప్రభుత్వ స్థలాన్ని దురాక్రమణ చేసినట్లు రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో టిడి మాధవి వెంటనే స్పందించారు. ఆక్రమణలను తొలగించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసారు. దీంతో ఆక్రమిత భూమిలోకి మండల సర్వేయర్ గుణశేఖర్ సిబ్బందితో వెళ్ళి కంచెను తొలగించారు. ప్రభుత్వ భూములను దురాక్రమణలు చేస్తే కఠిన చర్యలుంటాయని డిటి మాధవి హెచ్చరించారు.

## నాటు సారా జోరు.. పట్టించుకోండి సార్

సోమల, డిసెంబర్ 23, ప్రభాతవార్త సోమల మండలంలోని మారుమూల అటవీ ప్రాంతాల్లోని గ్రామాల్లో నాటు సారా అమ్మకాలు విచ్చలివిడిగా జరుగుతున్నాయి. తమ్మి నాయనపల్లి పంచాయతీ పేగలవారిపల్లి నాటు సారాకు అడ్డాగా మారిందని ప్రజలే వాపోతున్నారు. తక్కువ ధరకు నాటు సారా దొరకడంతో యువత నాటు సారా మొగ్గు చూపుతున్నారు. సంబంధిత అధికారులు మాత్రం నామమాత్రపు దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయ పలుకుబడితో మరికొందరు వ్యాపారాలను ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కందూరు, వల్లి గట్ల పంచాయతీల్లోనూ నాటు సారా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. నాటు సారా నాసిరకంగా ఉండడంతో మందుబాబులు అనారోగ్యం పాలవుతున్నారు. సంబంధిత అధికారులు నాటు సారా పై దృష్టి సాధించాల్సి ఉంది.

## బాలవికాస్ విద్యార్థులచే క్యాండిల్ ర్యాలీ

చిత్తూరురూరల్, డిసెంబరు 23 ప్రభాతవార్త:

చిత్తూరు పట్టణం, లక్ష్మీనగర్ కాలనీలోని మాజీ ఎమ్మెల్యే, భజన సెంటర్‌లలో ఉషానగర్ బాలవికాస్ విద్యార్థులచే క్యాండిల్ ర్యాలీ, నగర సంకీర్తన నిర్వహించినట్లు శ్రీసత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు మధుసూదనం తెలిపారు. అష్టోత్తరం, భజన, సర్వమత ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శన, క్రిస్మస్ గీతాలనంతరం మహామంగళ హారతి ప్రసాద వితరణ గావించినట్లు తెలిపారు. ఉషనగర్ భజనమండలి వ్యవస్థాపకులు సత్యనారాయణ, బాల వికాస్ గురువులు అనురాధ, వసంత, కల్పన, సావిత్రి, వాసవి, ముని, మొగిలి, సమితి కన్వీనర్ శేషనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రెవిన్యూ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులు పనిచేయరాదు

చౌడేపల్లి, డిసెంబర్ 23 ప్రభాతవార్త



రెవిన్యూ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులు పనిచేయరాదని రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గం ఎస్సీ సెల్ కార్యదర్శి ఒదులపేట రెడ్డెప్ప అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు రెవిన్యూ కార్యకలాపాలు చేస్తుండగా వెళ్ళి అడ్డుకొన్నారు. ప్రజలు, రైతులకు చెందిన ఆస్తుల పత్రాలు, రికార్డులను అధికారులు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి వారిచేత రాయించడం తగదన్నారు. ఇకపై ఇలాంటి చర్యలకు స్వస్తి పలకాలనీ, లేకుండా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. చారాల మాజీ సర్పంచు రెడ్డెప్ప, తదితరులు ప్రైవేటు వ్యక్తులను అడ్డుకొన్న వారిలో వున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పిఎఫ్ వివరాలు తెలుసుకోవడానికి ప్రత్యేక వెబ్‌సైట్

- ప్రారంభించిన జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు



చిత్తూరు, డిసెంబర్ 23 ప్రభాతవార్త:

ఉద్యోగ, ఉపాధ్యాయులు జడ్పీ ప్రావిడెంట్ ఫండ్ వివరాలను తెలుసుకోవడానికి జడ్పీ కార్యాలయంలో సోమవారం జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు ప్రత్యేక సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు ఒకే వెబ్‌సైట్ వుండటంతో ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో వారి పిఎఫ్ వివరాలను తెలుసుకోవడానికి ఇబ్బందులు పడేవారన్నారు. ప్రస్తుతం కొత్త వెబ్‌సైట్ ప్రారంభించడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈ వెబ్‌సైట్‌ను వినియోగించుకుని పిఎఫ్ వివరాలను తెలుసుకోవచ్చునన్నారు. ప్రస్తుతం 2021 మార్చి వరకు వివరాలు అందుబాటులో వున్నాయని, త్వరలో 2024 మార్చి వరకు వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నేతలు జడ్పీ సిఇఓకు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయ సంఘ నేతలు జివి రమణ, మదన్‌మోహన్‌రెడ్డి, మోహన్‌యాదవ్, సోమశేఖర్‌నాయుడు, మణికంఠ, రెడ్డిశేఖర్‌రెడ్డి, జయకాంత్, ముక్తార్ అహ్మద్, చిట్టిబాబు పాల్గొన్నారు.

## సకాలంలో సమస్యలు పరిష్కారం

చిత్తూరు, డిసెంబర్ 23 ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి అందిన సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం అసిస్టెంట్ కమీషనర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి చిత్తూరు మున్సిపల్ కార్పొరేష్ పరిధిలోని ప్రజల నుండి సమస్యలపై ఆరు అర్జీలు అందాయి. ఈ అర్జీల్లో ఇంజనీరింగ్ విభాగంకు సంబంధించి నాలుగు, ప్రజారోగ్య విభాగంకు సంబంధించి రెండు అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 29న కాణిపాకంలో ఉచిత ఆయుర్వేద మెడికల్ క్యాంప్

కాణిపాకం, డిసెంబర్ 23 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయస్వామివారి దేవస్థానంలో శ్రీవెంకటేశ్వర మెడికల్ కళాశాల, చిత్తూరు వారి ఆధ్వర్యంలో ఈనెల 29న ఉచిత ఆయుర్వేద చికిత్సా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. స్థానికఆస్థానమండపంలోఉదయం10 గంటల నుండి 2 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక శిబిరాన్ని కాణిపాకం పరిసర గ్రామస్థులు, భక్తులు సద్వినియోగం చేసుకోవలసిందిగా ఆయన కోరారు.

## టేలర్ హైస్కూల్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

కుప్పం, డిసెంబర్ 23 ప్రభాతవార్త



కుప్పం పట్టణంలోని టేలర్ హైస్కూల్‌లో సోమవారం ముందస్తు సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంకు టేలర్ స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం గౌరవాధ్యక్షులు డా॥ బిఆర్ సురేష్‌బాబు, పూర్వవిద్యార్థి ఫైరోజ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అన్ని మతాల సారాంశం ఒకటేనని మత విద్వేషాలు విడనాడి సమాజంలో సోదరభావంతో మెలగాలన్నారు. ఏసుక్రీస్తు సూచించిన శాంతిమార్గంలో పయనించాలని క్రీస్తు జీవితం ఆదర్శమని పేర్కొన్నారు. ఈసందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన ఏసుక్రీస్తు జననం ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డా॥ సుదర్శన్, రూబీ, తౌసిఫ్, ప్రమోద్‌కుమార్, అహ్మద్ బాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమంకు సిఎం చంద్రబాబు కృషి

- ఎపిఎస్‌ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



కుప్పం, డిసెంబర్ 23 ప్రభాతవార్త సమాజంలో ఉన్న దివ్యాంగులు,వృద్ధుల సంక్షేమంకు సిఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఎన్డీయే ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎపిఎస్‌ఆర్టీసి వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం కుప్పం బాలుర హైస్కూల్‌లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో అలిమ్కో సంస్థ ప్రతినిధులు దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాల పంపిణీ నిమిత్తం గుర్తింపు శిబిరాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం సహకారంతో అలిమ్కో సంస్థ ద్వారా సదరం సర్టిఫికెట్లను పరిశీలించి అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ పరికరాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ అధ్వర్యంలో కుప్పం, రామకుప్పం మండలాల్లో ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులకు కృత్రిమ పరికరాలు, వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లు, వాకింగ్ స్టిక్ తదితరాలను అందించడం జరుగుతుందన్నారు. ఈనెల 24న రామకుప్పంలో ఈ శిబిరం జరుగుతు ందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనికోరారు. కాగాదివ్యాంగుల సంక్షేమ శాఖ ఎడి మాట్లాడుతూ కుప్పంలో జరిగిన శిబిరంలో 815మంది హాజరు కాగా 687మంది ఉచిత పరికరాల కోసం అర్హత కలిగి ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, ఎంపిడిఓ సాయిలహరి, కౌన్సిలర్లు జిమ్ దాము, సోమశేఖర్, జాకీర్, కురబ కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, మంజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంకై అధికారులు చొరవ చూపాలి



కుప్పం, డిసెంబర్ 23 ప్రభాతవార్త ప్రజా సమస్యల పరిష్కారంకు అధికారులు చొరవ చూపాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కార్యక్రమంను ఆయన నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలనుంచి వివిధ సమస్యలపై ఇరవై వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ జనవరి నెలలో సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలో పర్యటిస్తారన్నారు. ఆలోపు ప్రజలు వివిధ సమస్యలపై ఇచ్చిన వినతులను పరిష్కరించాలని అలా కుదరని పక్షంలో ఎందుకు పరిష్కారం కాలేదో అధికారుల వద్ద సరైన సమాచారం ఉండాలని సూచించారు. కార్యక్రమాల్లో డిఇలు గురవారెడ్డి, పురుషోత్తం, సుబ్రమణ్యం, ఎడిలు ప్రభాకర్, హిమ్మత్ సాగర్, ఎంఇఓ మహబూబ్ బాషా, డిఆర్వో పుల్లయ్య, ఎఓ అమృతవల్లి, హెచ్ఓ డింపుప్రియశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఘనంగ సెమీ క్రిస్టమస్ వేడుకలు

తిరుపతి విద్య, డిసెంబర్ 23 ప్రభాతవార్త:



తిరుపతి సి.ఎస్.ఐ చర్చి నందు తిరుపతి ఫాస్టర్స్ ఆధ్వర్యంలో తిరుపతి,మంగళి పట్టు,చెర్లోపల్లి, కరకంబాడి,కుర్రకాలువ కరకంబాడిచర్చిల సంయుక్త సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సి.ఎస్.ఐ తిరుపతి ఫాస్టేట్ కార్యదర్శి ఎలమంచిలి ప్రవీణ్ విచ్చేశారు. వారు మాట్లాడుతూ వచ్చే నెలలో కురకాలువ సిఎస్ఐ చర్చి నిర్మాణం పూర్తవుతారని,వెంటనే మూడు నెలలలో మంగళి పట్టు లో కూడా నిర్మాణం పూర్తవుతాదని,తిరుపతి టౌన్ చర్చి విషయమై వేలూరు సిఎస్ఐ డయాసిస్ బిషప్ మరియు ప్రధాన కార్యదర్శి తో చర్చించనున్నామన్నారు. ఈ సందర్భంగా కేతగిస్ట్,మిషనరీస్ ఫాస్ట్రేట్ ఆఫీసర్లకు క్రిస్మస్ కానుకలు అందించారు. చైర్మన్ రెవరెండ్ చంద్రమోళి కోశాధికారివిజయ్,పాస్టర్‌జైపాల్,కేతగిస్ట్ ఫిలిప్స్,సి మెంబర్,విమలమ్మ,దేవమణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు పురస్కారం



తిరుపతి విద్య, డిసెంబర్ 23 ప్రభాతవార్త:

విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం ఆధ్వర్యంలో పలు విభాగాలలో సేవలందించిన ప్రముఖులకు ప్రతి భా పురస్కారాలు అందజేశారు.ప్రపంచ ప్రతిభావం తుల దినోత్సవంలో భాగంగా విద్యావిభాగంలో సేవ లందించిన పద్మావతి మహిళావర్సిటీఅసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై అనిత, సామాజిక సేవారంగంలో నిరంతకృషి చేసి ఎంతో మంది మహిళా సంఘాలకు ఆసరాగా నిలిచినపవర్ ఆర్గనైజేషన్ సంస్థ అధినేత సావిత్రికి ఆ సంఘం నంది అవార్డులను అందించి సత్కరించింది.

## తొలి అడుగు విజయవంతం

తిరుపతి విద్య, డిసెంబర్ 23 ప్రభాతవార్త:

టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న డిగ్రీ విద్యా సంస్థలలో తొలిసారి అటానమస్ హోదాలో డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి.ఎస్ జీఎస్,ఎస్వీ ఆర్ట్స్ కళాశాల,ఎస్పీడబ్ల్యూ కళాశాలల్లో సోమవారం ఇంగ్లీష్ పేపర్1 పరీక్షకు 2824 మంది విద్యార్థులు హాజరయ్యారు.ఎస్‌జిఎస్లో 720,ఎస్పీడబ్లూలో 1084, ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో 1020మంది పరీక్షలు రాశారు.పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కళాశాల ప్రిన్సిపాళ్లు అన్ని ఏర్పాట్లు చేశారు.దీంతో అటానమస్ హోదాలో తొలి అడుగు విజయవంతంగా పూర్తి చేశారు.

## అన్నదాతల సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

తొట్టంబేడు, డిసెంబర్ 23 ప్రభాతవార్త



రెవెన్యూ సదస్సుల్లో భాగంగా సోమవారం మండలంలోని గురుకులపాళెం, చిన్నసింగమాల పంచాయతీ రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి తహశీల్దార్ మధుసూధనరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ అన్నదాతల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం ఈపథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. గ్రామాల్లో అన్నదాతలకు సమస్యలు ఉండకుండా రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరగకుండా ఉండేలా చూస్తామన్నారు. మండలంలోని 27 పంచాయతీలు 41 రెవెన్యూ గ్రామాల్లో ఈసదస్సులు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నారాయణస్వామి, సర్వేయర్ హరనాథ్ పలువురు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శివయ్య భక్తులకు ఆత్మీయ విందుభోజనం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 23 ప్రభాతవార్త



హైదరాబాదులోని షంషాబాద్‌కు చెందిన కందకట్ల సిద్దురెడ్డి, సతీమణి సరిత, తల్లి సరిత, కుమారులు కార్తీక్, రోహిత్‌లు ముందుగా శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ఈసంద ర్భంగా వీరికి ఆలయాధికారులు స్వాగతం పలికి స్వామిఅమ్మవార్ల ప్రత్యేకదర్శనం ఏర్పాటు చేశారు. ఆలయంలో వెలసిన స్వయంభువు శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం సన్నిధివీధిలోని రామ మందిరం వద్ద కందకట్ల సిద్దురెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500మందికి శివయ్య భక్తులతో ఆత్మీయ విందుభోజనం ఏర్పాటు చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కుటుంబసభ్యులు హర్ష, మనస్మి, సృజన, కార్తీక్‌గౌడ్‌లు పాల్గొనగా వీరికి స్థానిక యంగ్ ఎంప్లాయిస్ సోషల్‌సర్వీస్ సహాయ సహకారంతో అన్నదానం నిర్వహించారు. ప్రదీప్‌కుమార్,వెంకటేశ్వర్లు ,పార్థసారధి, శ్రీనివాసులు, ప్రదీప్‌కుమార్, రాజ, శివ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయిలో విద్యార్థులకు బహుమతులు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 23 ప్రభాతవార్త

జిల్లా పరిషత్ ఊరందూరు గ్రామంలో పదోతరగతి చదువుతున్న విద్యార్థిని జాహ్నవి మరియు తిరుపతి జిల్లాలో ప్రథమ బహుమతులు గెలిచనటువంటి విద్యార్థులు రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ సంస్థ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డిలు అభినందించారు. ఈసందర్భంగా రాష్ట్ర విద్యాపరిశోధన మరియు శిక్షణ సంస్థ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి అభినందించి బహుమతులను అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విజయంలో కూడా పాలుపంచుకోవాలని విద్యార్థులను ఉద్దేశించి తెలిపారు. నుంచి ఉన్నత స్థానాలకు ఎదిగిన అనేక మంది జీవిత చరిత్రలు తెలుసుకోవాలని ఆడపిల్లలు విద్యతో పాటుఅన్నిరంగాల్లోనుఅవకాశాలనుతెలిపారు. తల్లిదండ్రుల ఆశలను ఆకాంక్షలు బాధ్యత నెరవేర్చాలన్నారు.

## అసలు బోనుపల్లి గ్రామంలో ఏం జరుగుతోంది?

తొట్టంబేడు, డిసెంబర్ 23 ప్రభాతవార్త



బోనుపల్లి గ్రామంలో అసలు ఏం జరుగుతోందని, వైకాపా నాయకుడు కోవిచంద్రయ్య నాయుడు గ్రామాన్ని ఎందుకు చిన్నాభిన్నం చేస్తున్నాడని ప్రశాంతంగా ఉన్న గ్రామంలో వివాదాలు పెడుతూ గ్రామాన్ని తలగబెడుతూ అలజడి సృష్టిస్తున్నాడని పాలసరఫరా సంఘ మాజీ ఛైర్మన్ రావిళ్ళమునిరాజనాయుడు తెలిపారు. సోమవారం తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో జరిగిన విషయాన్ని జలకం ఆనంద్ తమ్ముడు ఎక్కడ మృతిచెందాడో వివరించారు. మునిసుబ్రమణ్యం అనే అతను చంద్రయ్యానాయుడు వద్ద పశువులు కాస్తూ ఉండేవాడని పశువుల కొట్టంలోనే చనిపోయాడని తెలిపారు. ఈవిషయాన్ని తన మీదకు ఎక్కడ వస్తుందో అని తానే స్వయంగా జలకం ఆనంద్ ద్వారా తిరుపతి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డికి చెప్పించి మాట్లాడించారన్నారు. దానికి అధికార పార్టీ గ్రామ అధ్యక్షుడు అయిన రామానాయుడును నిందించడం సబబుకాదన్నారు. ఈసందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ కరుణాకర్‌రెడ్డి గ్రామాన్ని సందర్శించి నిజానిజాలు తెలుసుకుని తెలియజేశారు. వైకాపా నాయకులు మాటలు విని మాట్లాడడం నిజానిజాలు తెలుసుకోవడం మంచిదని హితవు పలికారు. జలకం పూర్ణిమ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తనపై దాడిచేసినట్లు వివరించారు. దీనిపై పోలీసులకు పిర్యాదు చేయగా కనీసం కేసు కూడా నమోదు చేయలేదని తర్వాత తాను హైకోర్టులో వెళ్ళి వినతిపత్రం ఇచ్చానన్నారు. సమావేశంలో బోనుపల్లి గ్రామస్తులతో పాటు పలువురు దేశం నాయకులు పాల్గొన్నారు.

## రైతే దేశానికి వెన్నెముక

.శ్రీకాళహస్తి, డిసెంబర్ 23 ప్రభాతవార్త



పట్టణంలోని జయరామారావువీధిలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో జాతీయ రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా రైతులను ఆహ్వానించి వారిని సత్కరించారు. ఈసందర్భంగా ఎజిఎం సురేష్ మాట్లాడుతూ దేశానికి వెన్నెముకగా రైతులు నిలిచి ఉన్నారని వారిని సత్కరించుకోవడం ఎంతో సంతోషమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చరణ్‌సింగ్ జన్మదినమైన డిసెంబర్ 23వతేదీన ప్రతి ఏటా రైతు దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సి.సుధాకర్, అకడమిక్ డీన్ శంకర్, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి గిరిజ, ప్రైమరీ ఇన్‌ఛార్జి మాధవీలత, వి.గౌరి, ఏఓ శివకృష్ణరాజు పాల్గొని రైతుల గురించి వివరించారు.

## స్మశానానికి దారి సౌకర్యం కల్పించాలి



**సత్యవేడు, డిసెంబరు 23 ప్రభాతవార్త:** తమ గ్రామంలో స్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని తిరుపతి జిల్లా సత్యవేడు మండలం నరసరాజు అగ్రహారం గ్రామస్తులు పలువురు అధికారుల బృందానికి విన్నవించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ బాలాజీ అధ్యక్షతన రెవెన్యూ డీటీ వెంకటేషన్, అధికారుల బృందం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ నేపథ్యంలో పలు సమస్యలను గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. ఈ క్రమంలో సర్వే నెం.4లో 0-56 సెంట్లు భూమిని గ్రామస్తులు స్మశాన వాటికగా వినియోగిస్తున్నట్టు సర్పంచ్ బాలాజీ విన్నవించారు. అయితే వెళ్లే దారిలో ప్రైవేటు వ్యక్తుల భూములు ఉండడం వల్ల మృతదేహాన్ని తీసుకెళ్ళడానికి అభ్యంతరాలు ఉన్నాయన్నారు. అలాగే ఇందిరమ్మ పక్కా గృహాలపై పోతున్న విద్యుత్ తీగలను తొలగించాలని గ్రామస్తురాలు లక్ష్మి వినతి అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్ఐ సురేష్, వీఆర్వో విక్రాంత్, డిజిటల్ అసిస్టెంట్ గోవర్ధన్, వ్యవసాయ అసిస్టెంట్ స్వర్ణ, వెటర్నరీ అసిస్టెంట్ షాదుల్లా, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ధనలక్ష్మి, ఏఎన్ఎం రోస్లిన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉత్తమ ర్యాంక్ సాధనకు కృషి చేయాలి

తిరుపతి విద్య డిసెంబర్ 23 ప్రభాతవార్త:



పద్మావతి మహిళా వర్సిటీ జాతీయ స్థాయిలో 2025 సంవత్సరంలో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని వీసీ ప్రొఫెసర్ వి ఉమ పిలుపునిచ్చారు. సోమవారం వర్సిటీ సావేరీ సెమినార్ హాల్లో నేషనల్ ర్యాంకింగ్2025 కీలక మార్పులు, సవాళ్లు అనే అంశంపై నేషనల్ వర్క్షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగిస్తూ వర్సిటీ ఇప్పటికే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని, 100లోపు ర్యాంకు సాధనే లక్ష్యంగా అధ్యాపకులు, సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకటకృష్ణ, ఐక్యూఏసీ డైరెక్టర్ త్రిపుర సుందరి, డీన్, పీఎంఉషా ప్రాజెక్ట్ కోర్డినేటర్ సి వాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగంపై యువత మొగ్గు చూపాలి

తిరుపతి విద్య డిసెంబర్ 23 ప్రభాత వార్త:



రైతు దేశానికి అన్నదాతగా వెలసిల్లుతున్నాడని, యువత వ్యవసాయ రంగంపై మొగ్గు చూపాల్సిన అవసరం ఉందని వీసీ సీహెచ్ అప్పారావు పిలుపునిచ్చారు. సోమవారం ఎస్వీయూ వృక్ష శాస్త్ర విభాగ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా వర్సిటీ వ్యవసాయ క్షేత్రంలో జరిగిన చౌదరి చరణ్ సింగ్ జయంతిలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చరణ్ సింగ్ రైతులకు చేసిన నిరంతర సేవలకు గుర్తుగా ఆయన జయంతిని కేంద్ర ప్రభుత్వం జాతీయ రైతు దినోత్సవం గా ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఉద్యమ కారుడు గంగాధర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, నాగలక్ష్మీ విజయ, కామాక్షి, విద్యార్థులు పాల్గొన్నారు

## నైపుణ్యతతో కూడిన విద్యతోనే జీవిత లక్ష్యం సాధ్యం

తిరుపతి విద్య, డిసెంబర్ 23 ప్రభాత వార్త:



పోటీ ప్రపంచంలో విద్యార్థులు నైపుణ్యతతో కూడిన విద్యను అందిపుచ్చుకున్నప్పుడే జీవిత లక్ష్యం సాధించవచ్చునని ఎస్వీయూ రిజిస్టర్ భూపతి నాయుడు సూచించారు. సోమవారం వర్సిటీ సెనేట్ హాల్లో గిరిజన నవ సమాజ్ తృతీయ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నవ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షులు పాలిత్యా శివశంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించడానికి 1,215 కోట్లను ప్రభుత్వం వెచ్చించి రాష్ట్రవ్యాప్తంగా స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేస్తోందన్నారు. ఎస్వీయూ పరిధిలో కూడా 20వేల చదరపు అడుగుల స్థలాన్ని ఇందుకోసం సమకూర్చామన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుధారాణి మాట్లాడుతూ వ్యక్తిగా సాధించలేని పనిని సమూహంగా ఏర్పడి కృషి చేస్తే సులువుగా సాధించవచ్చన్నారు. గిరిజన నవ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షు పాలిత్యా శివ శంకర్ నాయక్ మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను కల్పించడం కోసం, విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించుకోవడానికి తగిన కార్యక్రమాలను నిత్యం నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. రూయా, స్విమ్స్ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు రక్తదానం చేస్తున్నామని, విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలను చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం సినీ గాయకుడు దేవా, ఆనందయ్య ఆలపించిన భక్తి, సినిమా గీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపల్ పద్మనాభం, మసూమయ్య, అనంతపురం జిల్లా అధ్యక్షులు బాలునాయక్, తిరుపతి జిల్లా అధ్యక్షులు సురేంద్ర, వెంకటాద్రి, సూర్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ యువజన దినోత్సవంలో నిర్వహించే పోటీలకు పేర్లు నమోదు చేసుకోండి

తిరుపతి క్రీడ, డిసెంబర్ 23, ప్రభాతవార్త

శ్రీ వివేకానంద స్వామి జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతంలోని యువతీ యువకులకు సెట్విన్ తిరుపతి వారు నిర్వహించే పోటీలలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని ముఖ్య కార్యానిర్వహణాధికారి కో. మోహన్ కుమార్ తెలిపారు. స్వామి వివేకానంద జీవిత సందేశం వ్యాస రచన, ప్రసంగం, నేటి సమాజ నిర్మాణము పై యువత పాత్ర, మాదక ద్రవ్యాలు - వ్యసనము దాని ఫలితాలు చర్చ గోష్టి, క్విజ్, డ్రామా, స్కిట్ తదితర పోటీలో పాల్గొనేందుకు 16 నుండి 29 సంవత్సరాల వయస్సు గల గ్రామీణ, పట్టణ యువతీ యువకులు, విద్యార్థులు జనవరి 5వ తేది లోపు పూర్తి వివరాలతో సెట్విన్ కార్యాలయంకు నేరుగా గానీ మెయిల్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. మరెన్ని వివరాలకు 0877 - 2286921, 9440573537 , 7036428762 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

## తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్‌లో సుబ్రహ్మణ్యంకు ఘన సత్కారం

తిరుపతి విద్య, డిసెంబర్ 23 ప్రభాతవార్త:



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్‌లో రచయిత గాయకునికీ ఘన సత్కారం విజయవాడ తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఉభయ తెలుగు రాష్ట్రాలలో వివిధ రంగాలలో నిష్ణాతులైన పలువురును గుర్తించారు. విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో నిర్వహించిన బృహత్తర కార్యక్రమంలో ఈ మధ్య జరిగిన విజయవాడ బుడమలేరు వరద గల్లంతు గురించి ఆ సాధక బాధలు గురించి పాట రచించి తనే సొంతంగా పాడి కవులు అందరిని శోకసముద్రంలో నింపారు. ఆ గల్లంతు కంటికి కనిపించినట్లు ఇప్పుడే మన ముందర జరిగినట్లు పాట పాడి అందరి మనసులు దోచుకున్న గుండ్లూరు సుబ్రహ్మణ్యకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ జ్ఞాపికను మెమెంటోతో ఘనంగా సన్మానించారు. సమస్త జాతీయ ఛైర్మన్ డాక్టర్ యు వి రత్నం జాతీయ కన్వీనర్ డాక్టర్ ధనా సి ఉషారాణి తెలుగు శాఖ అధిపతి డాక్టర్ బాలచందర్ సారే డాక్టర్ చివుకుల సాంబశివరావు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**నగరి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసపూరిత వెబ్‌సైట్స్‌ని నమ్మి మోసపోవద్దని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలియజేశారు. సోమవారం కళాశాలలో కన్స్యూమర్ క్లబ్ విభాగం ఏర్పాటు చేసిన జాతీయ వినియోగదారుల దినోత్సవం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నేడు ఆన్‌లైన్ వ్యాపారాలు ఎక్కువయ్యాయని, నమ్మకమైన, ప్రభుత్వ గుర్తింపు పొందిన వెబ్‌సైట్స్ ద్వారానే ఆన్‌లైన్ వస్తువులను, సేవలను పొందాలని, లేదంటే మోసపోయే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రాజు, కామర్స్ విభాగం అధ్యక్షుడు భాస్కర్, ఐక్యూ కో-ఆర్డినేటర్ ఇందిరా ప్రియ దర్శిని, కళాశాలకంట్రోలర్‌ఆఫ్‌ఎక్సామినేషన్స్ వేణుగోపాల్, కిరణ్, హరికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా కాళభైరవాష్టమి పూజలు



**నగరి, డిసెంబరు 23 ప్రభాతవార్త:** స్థానిక కామాక్షి సమేత కరకంఠేశ్వర ఆలయంలోని కాళభైరవ సన్నిధిలో సోమవారం కాళభైరవ అష్టమి పూజలను వైభవంగా నిర్వహించారు. స్వామికి పాలు, పెరుగు పంచామృతంతో అభిషేకం చేశారు. అభిషేకానంతరం పుష్పాలతోను, వడమాలలతో స్వామిని సుందరంగా అలంకరించగా భక్తులను అమితంగా ఆకట్టుకుంది. అభిషేక పూజల్లోను భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. స్వామిని దర్శించుకుని ఆలయ ప్రసాదాలు స్వీకరించారు.

## సూర్య ఘర్ పథకంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

వరదయ్యపాలెం, డిసెంబరు 23, ప్రభాతవార్త



వరదయ్యపాలెం సబ్ స్టేషన్ వద్ద రైతులు, వినియోగదారులతో, సబ్ స్టేషన్ కమిటీ సమావేశంను ఏఈ విజయ్ వెంకటేష్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ పథకం క్రింద డిస్కములు సంబంధిత ప్రాంతాలలో రూఫ్ టాప్ సోలార్ను ప్రోత్సహించడానికి నెట్ మీటర్ల లభ్యత సకాలంలో ఇన్స్టాలేషన్లు తనిఖీ చేయడం ప్రారంభించడం వెండర్ రిజిస్ట్రేషన్, మేనేజ్మెంట్ సోలార్ రైజింగ్ కోసం ఇంటర్ డిపార్ట్మెంట్ కన్వర్షన్ వంటి అనేక సులభతరం చేసిందని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలి అని వరదయ్యపాలెం విద్యుత్ ఏఈ విజయ్ వెంకటేష్ తెలిపారు. ప్రస్తుతం వరదయ్యపాలెంలో 2, మోపురుపల్లిలో 1, సంతవేలూరు లో 1 సోలార్ అమర్చడం జరిగిందని తెలిపారు. ఎస్సి ఎస్టీ లకు ఉచితంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం చెరువు నీరు పారడం వలన, రైతులకు 7 గంటల విద్యుత్ పై ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేదని రైతు మునికృష్ణమ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత గుత్తి త్యాగరాజు, జెఈ సుబ్రహ్మణ్యం, హరి, మరదవాడ మహేష్, మన్నెం ఈశ్వర్, మన్నెం చెంచులక్ష్మి, మునికృష్ణమ నాయుడు, వెంకటయ్య, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రిస్మస్ ర్యాలి



శ్రీకాళహస్తి, డిసెంబర్ 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సారధ్యంలో సోమవారం పట్టణవీధుల్లో భారీ ఎత్తున ర్యాలి నిర్వహించారు. ఈ నెల 25న క్రిస్మస్ సందర్భంగా పట్టణ ప్రజలకు పిలుపు నిస్తూ ర్యాలిని ఆర్‌టిసి బస్టాండు నుంచి నాలుగుమాడావీధుల్లో ర్యాలి సాగింది. క్రీస్తు జననంకు సంబంధించి శాంతి సందేశాన్ని అందిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తూ ర్యాలిని సాగించారు. ఈ కార్యక్రమాలకు సంఘం అధ్యక్షులు పాస్టర్ అంబ్రోస్, గౌరవాధ్యక్షులు పాస్టర్ సుందర్‌రాజన్, గౌరవ అధ్యక్షులు పాస్టర్ జీవమణి, ప్రధాన కార్యదర్శి పాస్టర్ రవి డ్యాని, పాస్టర్ జోసెఫ్ ఉపాధ్యక్షులు పాస్టర్ మణిబాబు, పాస్టర్ మోజస్, బ్రదర్ రమేష్, విజయకుమార్, లు, రాజజేంద్ర, యోహాన్, సాల్మన్, మోహన్ చర్చిసభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణలు, గీతాలు ప్రజల్ని ఆకట్టుకున్నాయి.

## కార్పొరేట్లకు దోచి పెడుతున్న మోదీ ప్రభుత్వం

ఏ.పి రైతు సంఘం ర్యాలి: ఆర్‌డిఓకు వినతి

శ్రీకాళహస్తి, డిసెంబర్ 23 ప్రభాతవార్త



ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు దేశాన్ని కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోదీ ప్రభుత్వం చివరకు వ్యవసాయాన్ని కూడా ప్రైవేటు పరం చేసేందుకు కుట్ర చేస్తుందని ఏపి రైతు సంఘ నాయకులు ధ్వజమెత్తారు. సోమవారం వారు పట్టణంలో ర్యాలి నిర్వహించి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్‌మోర్చా పిలుపు మేరకు రైతు సంఘం సారధ్యంలో ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ధర్నా చేసినట్లు వివరించారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ మాట్లాడుతూ 2021లో పార్లమెంటు సాక్షిగా ప్రధాని మోదీ నల్ల చట్టాలను ఉపయోగించుకుంటూ రైతులకు క్షమాపణలు చెప్పారని గుర్తు చేసారు. అయితే దొడ్డిదారిన కార్పొరేట్ కంపెనీలకు మేల జరిగేలా వ్యవసాయాన్ని ప్రైవేటీ కరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు దిశా నిర్దేశం చేస్తూ సర్కులర్ జారి చేసిందన్నారు. ఇది ఎంత వరకు సమంజసమన్నారు. ఈ సందర్భంగా రైతుల డిమాండ్‌లను విన్నవిస్తూ ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ ఆందోళనా కార్యక్రమాల్లో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శంకరయ్య, గంధం మణి, మునిశంకర్, నాగరాజు, రాపూరు సుబ్రమణ్యం, వేణు, అన్వర్‌బాషా, వెంకటేష్, వేలివేంద్రం, సుధాకర్, నాగ్గదాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రసాయనిక ఎరువుల వాడకంతో కాలుష్యం

ఆగ్రోటెక్ చైతన్య సభ



శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 23 ప్రభాతవార్త

పంటసాగులో రసాయనిక ఎరువుల వాడకం వల్ల ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని విన్నూత్న ఆగ్రోటెకన ఎల్ఎల్‌పి మార్కెట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె.కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం శ్రీకాళహస్తి మండలంలోని రెడ్డిపల్లి, కమ్మకొత్తూరు గ్రామాల్లో రైతు అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ యాజమాన్యం రైతులకు సేంద్రీయ ఎరువులు, జీవన ఎరువులకు సంబంధించిన తేడాలను వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. వినూత్న ఆగ్రో టెక్ ఎల్ఎల్‌పి వారు రైతులకు అందించే సేంద్రీయ జీవన ఎరువులైన 'యోధసేంద్రీయ ఎరువులు, యోధ సిఎంఎస్, జీవన్‌గోల్డ్, రైతు మిత్ర, ప్రణయ్ గ్రో హైగ్రాన్యూల్ గ్రోహై లిక్విడ్, డెల్టా ప్రో, తులిప్, యువరాజ్, డైనమైట్, జనని, ట్రిగర్2 టర్బో2 కెజిఎఫ్ 6, రోషిని, ఉజ్వల్2 త్రిశూల్, ధర్మవీర్, రత్నాతదితరాలను పంటలకు వాడి భూమిలోని మిత్రపురుగులు అయినటువంటి సూక్ష్మజీవులను అభివృద్ది చేసి మొక్కలకు కావాల్సిన పోషకాలను అందించి మొక్కలలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయనిరైతులకుతెలిపారు. అవగాహనసదస్సుల్లోకంపెనీప్రతినిధులుజిఎం అక్కిం శ్రీనివాసు లురెడ్డి, ఎఎస్ఎం యర్రంశెట్టి రామకృష్ణయ్య, ఎఫ్ఏ కే.ఈశ్వరయ్య, కె.కిరణ్‌కుమార్ గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని చర్చి వద్ద సోమవారం సెమి క్రిస్మస్ వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. పార్టీ అధ్యక్షుడు తలపా దామోదర్‌రెడ్డి సారధ్యంలో చర్చిలో ఏర్పాటు కార్యక్రమాలకు జిల్లా నాయకుడు బాలగురవం బాబు ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ప్రార్ధనలు జరిపారు. కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి పట్టణ నాయకులు కర్రిముళ్ళ, ఆంటోని, చందు, బద్రి, శంకర్, శ్రీకాళహస్తి మండల నాయకులు నవీన్, ధనకుమార్, రేణిగుంటమండఅధ్యక్షులు రాహుల్, చిరంజీవి, గుణ, ప్రభ, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

## కేవీబీ పురం మండలంలో జోరందుకున్న వరి నాట్లు

కేవీబీ పురం, డిసెంబరు 23 ప్రభాతవార్త:



మండలంలో ఇటీవల కురిసిన వర్షాలు ఆగడంతో వరి నాట్లతో రైతులు జోరు పెంచారు. ఈ వర్షాలతో వేరుశనగలు పంటలు పూర్తిగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చేసేది లేక బోరు బావుల్లో పుష్కలంగా నీళ్లు వస్తుండడంతో వరి నాట్లు మొదలు పెట్టారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో వరి నాట్లు వేసి రైతాంగానికి వరి వంగడాలపైన వ్యవసాయంలో అధిక దిగుబడులు పొందడానికి క్రిమి సంహారక మందులు, ఎరువులు వాటి సస్యరక్షణ చర్యలపై క్షేత్ర స్థాయిలో వారికి సూచనలు ప్రభుత్వ సబ్సిడీలను పంపిణీలకు తగు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయశాఖ స్పందించి రైతాంగానికి అధిక దిగుబడులు ఇచ్చే విధంగా వ్యవసాయ సూచనలు అందించాలని రైతాంగం కోరుతున్నారు.

## నాణ్యమైన విద్యుత్తు అందిస్తాం..



విద్యుత్ శాఖ అధికారులు

రేణిగుంట, డిసెంబర్ 23 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సూచనలతో రేణిగుంట మండలం కరకంబాడి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అధికారులు వినియోగదారుల సదస్సును సోమవారం నిర్వహించినారు. సదస్సుకు వినియోగదారులు హాజరై తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పల్లె ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయని, తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, తక్కువ విద్యుత్తు వినియోగించినప్పటికీ విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. టిడిపి నేతలు అగ్రహారం భాస్కర్ రెడ్డి, కాపిరెడ్డి నాదమున్ రెడ్డి విద్యుత్ సమస్యలపై అధికారులతో చర్చించారు. కరకంబాడి టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ బాలసుబ్రమణ్యం నాయుడు (బుజ్జి నాయుడు) లోడ్ ఎక్కువ ఉన్నందున ట్రాన్స్ఫార్మర్ల సంఖ్య పెంచాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఏపీ ఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర రావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యుత్ కోత, హెచ్చుతగ్గులు లేని నాణ్యమైన విద్యుత్తు అందించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డిప్యూటీ ఇంజనీర్ రమేష్ బాబు, అర్బన్ ఏ ఈ పుణ్యకోటి, జూనియర్ ఇంజనీర్లు రజాక్, ప్రసన్న, టిడిపి కరకంబాడి క్లస్టర్ ఇంచార్జ్ బాలసుబ్రమణ్యంనాయుడు, (బుజ్జి నాయుడు) ఈశ్వరమ్మ, కోదండపాణి, శంకర్, ముని రాజా పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కరించుకోండి

రేణిగుంట డిసెంబర్23 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకొని ప్రజలు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని రేణిగుంట తహసిల్దార్ సురేష్ బాబు అన్నారు. మండలంలోని జి పాలెం నందు సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఒక స్మశాన భూమి, మూడు ఆర్ఓఆర్లు, మూడు సర్వేలకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించినట్టు తహసిల్దార్ తెలిపారు. దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన ప్రజలను కోరారు.

## రాస్ ద్వారా రైతులకు రూ.కోటి పది లక్షల రుణాలు..

రైతులే దేశానికి ప్రాణదాతలు.. వెంకటరత్నం.



రేణిగుంట, డిసెంబర్ 23 ప్రభాతవార్త

ఎండనక వాననక చలిలో వణుకుతూ రాత్రి పగలు తేడా లేకుండా కష్టపడి పంటలు పండించి అన్నం పెడుతున్న రైతులే నిజమైన ప్రాణదాతలని రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరత్నం అన్నారు. తిరుపతి రాస్ (రాష్ట్రీయ సేవా సమితి) ప్రధాన కార్యాలయంలో సోమవారం తిరుపతి జిల్లా రైతులకు జాతీయ రైతుల దినోత్సవం పురస్కరించుకొని రేణిగుంట మండలం చైతన్య పురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో అవగాహన కార్యక్రమం జరిగింది. రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం దాదాపు 140 మంది రైతులకు 1,10,000 రూపాయలను సంఘాల ద్వారా రుణాలను అందజేశారు. రైతులకు తక్కువ ఖర్చుతో ఆధునిక పద్ధతుల్లో సేంద్రీయ ఎరువులను ఉపయోగించి ఎక్కువ దిగుబడి సాధించే పద్ధతులపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రజ్ఞులు అవగాహన కల్పించారు. అంతేకాకుండా తక్కువ ఖర్చుతో డ్రోన్ల ద్వారా విత్తనాలు చల్లడం, ఎరువులు, పురుగుల మందులు పిచికారి చేయడంపై వివరించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతురాలైన లక్ష్మమ్మకు ట్రైసైకిలు అందజేశారు. కార్యక్రమంలో సైకాలజీ నిపుణులు చంద్రమౌళి, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త హెడ్ శ్రీనివాసులు, రాస్ పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు, రాస్ సిబ్బంది వాణి, భార్గవి, వనజ, నాగేశ్వర్, రాస్ రైతు ప్రగతి సిబ్బంది సివి నాయుడు, రైతులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## నాణ్యతతో ప్రహరీ పనులను పూర్తి చేయండి : జడ్పీటీసీ

నారాయణవనం, డిసెంబర్ 23 ప్రభాతవార్త :



మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీ మండల విద్యా శాఖ కార్యాలయం (ఎమ్మార్సీ)లో జడ్పీ నిధులతో మంజూరు చేసిన 5లక్షల రూపాయాల వ్యయంతో కాంపౌండ్ పనులను చేపడుతున్నారు. జడ్పీటీసీ, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార ఈ నిధులను ఉన్నత అధికారులతో సం ప్రదింపులు జరిపి నిధులు మంజూరు చేయించారు. సోమవార ం ఈ పనులను జడ్పీటీసీ పరిశీలి ంచి నాణ్యతతో పూర్తి చేయాలని గుత్తేదారును కోరారు. ఆయనతో పాటు పుత్తూరు డిప్యూటీ డిఇఓ ప్రభాకర్‌రాజు, టిడిపి యువ నాయకుడు పిజి ముఖేష్ తదితరులు వున్నారు.

## రేపు క్రిస్‌మస్ వేడుకలకు ప్రార్ధన మందిరాలు ముస్తాబు

నారాయణవనం, డిసెంబర్ 23 ప్రభాతవార్త :



బుధవారం క్రిస్‌మస్ పండుగను జరుపుకోవడం కోస ం అన్నిగ్రామాల్లో వెలసిన క్రీస్తు మందిరాలను విద్యుత్‌దీపాలు, తోరణాలతో సర్వంగా సుందర ంగా అలంకరించారు. ఈనెల 1వతేది నుంచి క్రైస్తవ సోదరులు చర్చిలకు వెళ్లి భక్తి శ్రద్దలతో ఉపవాసదీక్షలు పాటించడంతో పాటు ప్రార్ధనలను చేస్తున్నారు. బుధవారం క్రిస్‌మస్ పండుగను జరుపుకోవడం కోసం ప్రార్ధన మందిరాలకు వెల్లకొట్టడంతో పాటు మందిరాలను విద్యుత్‌దీపాలు, తోరణాలతో అలంకరిస్తున్నారు. అలాగే ప్రార్ధనమందిరాల వద్ద క్రిస్‌మస్ చెట్టును నాటడంతో పాటు వాటిని విద్యుత్ తోరణాలతో అలంకరించారు.

## ఘనంగా నరువి హాస్పిటల్స్ వ్యవస్థాపక దినోత్సవం

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 23 ప్రభాతవార్త



వేలూరులోని నాణ్యమైన మెరుగైన చికిత్సను అందించే నరువి హాస్పిటల్స్ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో సహజ వనరులను పరిరక్షించడం, ప్రపంచ సామరస్యాన్ని పెంపొందిచడం, మతపరమైన సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడం, మత్తుపదార్థాలను వ్యతిరేకించడాన్ని వ్యవస్థాపక దినోత్సవంలో ప్రధాన అంశాలుగా నిలిచాయి. నరువి హాస్పిటల్స్ ఛైర్మెన్, వ్యవస్థాపకుడు డాక్టర్ జీవి సంపత్ ఈ సందర్భంగా పలు అంశాలకు సంబంధించి నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరంఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పు కోసం అవకాశం ఉన్నచోట్ల మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. దీంతో ప్రపంచ హానికరమైన ప్రభావాలను రివర్స్ చేయాల్సిన సమయం ఆసన్నమైందని, దీని వల్ల సహజ నీటివనరుల క్షీణతను తగ్గించవచ్చునని అన్నారు. దీనికి గాను తమిళనాడు ప్రభుత్వం కొన్ని కార్యక్రమాలు చేపడుతుండగా, నరువి హాస్పిటల్స్ తన వంతు సహకారం అందజేస్తూ నీటి వనరులను సంరక్షిస్తోందని తెలిపారు. దీంతో పాటు మత్తుపదార్థాలను ఉపయోగాన్ని అణిచివేత దిశగా చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నరువి హాస్పిటల్స్ వైస్ ఛైర్ పర్సన్, అనితా సంపత్, ఎగ్జిక్యూ టివ్ డైరెక్టర్ డాక్టర్ పాల్, జనరల్ మెడిసన్ హెడ్ డాక్టర్ కురియన్ థామస్, ఈఎన్టీ హెడ్ డాక్టర్ మేరీ కురియన్, న్యూరాలజీ హెడ్ డాక్టర్ చిత్రాంబలం, జనరల్ మెడిసన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ గుణశేఖరన్, ఇతర డాక్టర్లు, పారామెడికల్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ విద్య వందన సమర్పణ చేశారు.

## డంపింగ్ యార్డును ఎందుకు సద్వినియోగం చేసుకోలేదు

-పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించిన ఎమ్మెల్యే



తిరుపతిరూరల్, డిసెంబర్ 23 ప్రభాతవార్త:

తుమ్మలగుంట గ్రామ పంచాయతీకి ఎంచక్కా డంపింగ్ యార్డు ఉన్నప్పటికి ఎందుకు వినియోగిం చుకోలేదని ఎమ్మెల్యే పులివర్తి నాని పంచాయతీ కార్యధర్శి వేంకటేశ్వర్లును ప్రశ్నించారు. పంచాయతీలో పారిశుధ్యం అధ్వన్నంగా ఉందని, డ్రైనేజీనీరు రోడ్లపైకి వస్తున్నాయని, బక్కిరెడ్డి కాలనీలో మురుగునీరు నిలువ ఉందని, ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. దాదాపు 10కోట్ల రుపాయాలతో తుమ్మలగుంటలో భూగర్భ డ్రైనేజ్ ఏర్పాటు చేయటానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైన పంచాయతీ కార్యధర్శి స్పందించి పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేత దొడ్ల కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో హైకోర్టు జడ్జి

శ్రీకాళహస్తి, డిసెంబర్ 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం అతిథులతో కిటకిట లాడింది. సోమవారం శివయ్యకు ప్రీతిపాత్రమైన రోజు కాబట్టి అభిషేకాలు జరిపించుకొనుటకు భక్తులు కదలి వస్తారు. అలాగే విఐపిల తాకిడి కూడ అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో సోమవారం హైకోర్టు జడ్జి చల్లా గుణరంజన్ కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్ల సేవలో పాల్గొన్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి పిఆర్ఓ రవిలు వేదపండితులచే స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆలయం అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి ఆలయ మర్యాలతో వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలను అందించారు. స్వాగతం పలికిన వారిలో న్యాయశాఖకు చెందిన ప్రోటోకాల ఉద్యోగితో పాటు 12వ అడిషనల్ జిల్లా జడ్జి శ్రీనివాస్‌నాయక్, ఆలయ ఇన్స్‌పెక్టర్ హరిబాబుయాదవ్ తదితరులున్నారు.

## విఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించండి సిఐటియు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి రెవెన్యూశాఖ పరిధిలో పని చేస్తున్న విఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ సోమవారం సిఐటియు అనుబంధ తిరుపతి జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్‌లోని పలు మండల రెవెన్యూ కార్యాలయాల్లో పని చేస్తున్న అటెండర్లు, రికార్డు అసిస్టెంట్లు, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీ ఉన్నాయని వాటిని భర్తీ చేస్తే ఎందరికో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించిన పనులను ఏళ్ళ తరబడి గ్రామ రెవెన్యూ సహాయకులే చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈ పోస్టులన్నింటిని అర్హత ఉన్న విఆర్‌ఏలతో భర్తీ చేసారని శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎందుకో ఆ ప్రక్రియ అమలు జరగలేదన్నారు. పరిశీలించి భర్తీకి నిర్ణయం తీసుకుంటామని ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి వివరించారు. ఈ ఆందోళనల్లో సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, విఆర్‌ఏలు అంకయ్య, బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 27న విక్రమ్‌కళాశాలలో జాబ్‌మేళా

శ్రీకాళహస్తి, డిసెంబర్ 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని విక్రమ్ కళాశాలలో ఈ నెల 27న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పట్టాభి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్, సీడ్‌ఆఫ్, డిఆర్‌డిఏ సంయుక్తంగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు వివరించారు. 27వ తేది ఉదయం 9గంటల నఉంచి జాబ్‌మేళా ప్రారంభం అవుతుందని పట్టాభి వివరించారు. ఈ జాబ్‌మేళాలో బహుళ జాతీయ కంపెనీలైన సుజుకి, ఇసుజుమోటార్స్ ఇండియా, పోర్ట్‌మేనేజ్‌మెంట్, ఆపాచ్‌ఫుట్‌వేర్, ఇండియా తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత అయిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 23 ప్రభాతవార్త

ఏర్పేడు మండలం దుర్గిపేరికి చెందిన గాది వెంకటేష్ (36) సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దుర్గిపేరికి చెందిన వెంకటేష్ నార్లు నాటడానికి తన సొంత వాహనం టివియస్ ఎక్స్‌ఎల్‌పై చిందేపల్లికి వెళుతుండగా చిందే పల్లి గ్రామానికి సమీపంలో వెంకటగిరి-ఏర్పేడు మార్గంలో పయనిస్తున్న జీపు ఢీకొంది. వెంకటేష్ అక్కడి కక్కడే మృతి చెందారు. ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు

## నీటి సంఘ అధ్యక్షుడిని అభినందించిన ఎమ్మెల్యే

**విజయపురం, డిసెంబరు 23 ప్రభాతవార్త:**



మండలంలోని కడియంబాకం చెరువు ఆయకట్ట నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన గాలి రమేష్ నాయుడుని సోమవారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శాలువ కప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పని చేయాలన్నారు.

# గూడూరు డివిజన్



## రాకెట్ ప్రయోగ వీక్షణ కోసం ఇస్రో ఆహ్వానం

శ్రీహరికోట (తడ), డిసెంబర్ 23 ప్రభాతవార్త : ఈ నెల 30న జరగనున్న పిఎస్ఎల్వి-సి60 రాకెట్ ప్రయోగ వీక్షణ కోసం ఇస్రో సందర్శకులను ఆహ్వానించింది. అయితే ఈ ప్రయోగం రాత్రి 9.48 గంటలకు జరపనున్నట్లు సోమవారం ఇస్రో ప్రకటించింది. షార్‌లో రాకెట్ ప్రయోగాన్ని దగ్గరగా వీక్షించడానికి దూరప్రాంతాల నుంచి సైతం ఎక్కువమంది సందర్శకులు తరలివస్తుంటారు. అయితే ఈ సారి రాత్రిపూట ప్రయోగం కావడంతో ఈ సంఖ్య ఎంతవరకు ఉంటుందన్నది తేలాల్సి ఉంది.

## పేటలో బెల్టుషాపులపై ఎక్సైజ్ దాడులు

నాయుడుపేట డిసంబరు 23 ప్రభాతవార్త : నాయుడుపేట మండలంలోని పలుగ్రామాల్లో అక్రమంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్న స్థావరాలపై నాయుడుపేట ప్రొబిషన్,ఎక్సైజ్ సిఐ అరుణకుమారి తన సిబ్బందితో కలిసి సోమవారం దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో కాపులూరు గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న మేకల రమేష్ అదుపులోనికి తీసుకొని అతని వద్దఉన్న 13మద్యం సీసాలను స్వాదీన పరుచుకొని అరెస్టుచేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు సిఐ తెలియజేశారు. సిఐ అరుణకుమారి మాట్లడుతూ గ్రామాల్లో ఎవరైన ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు నిర్వహిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఈకార్యక్రమంలో ఆమె వెంట గూడూరు టస్క్‌పోర్స్ సిఐ బాలకృష్ణ,ఎస్సై గంగాధర్,సిబ్బంది రవి, అహ్మద్ తదితరులు ఉన్నారున్నారు.

## రూరల్ పోలీస్ స్టేషన్లో డీఎస్పీ తనిఖీలు



గూడూరు, డిసెంబర్ 23 ప్రభాతవార్త : గూడూరు రూరల్‌లో ఉన్న పోలీస్ స్టేషన్‌ను శనివారం గూడూరు డిఎస్పి వివి రమణకుమార్ తనిఖీలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా గూడూరు సబ్ డివిజన్ పరిధిలోని గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ తనకి చేయడం జరిగిందని స్టేషన్లో రికార్డులు పరిశీలించారు. నమోదైన కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యతలకు న్యాయం చేయాలన్నారు. పట్టణ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ కంట్రోల్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ కిషోర్ బాబు, ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు దెబ్బతిన్న ఆర్ఎన్ఆర్ వరి రకం / - ఆదుకోవాలని రైతులు వేడుకోలు

చిట్టమూరు, డిసెంబర్ 23 ప్రభాతవార్త : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మెట్ట రైతులు సాగు చేసిన ఆర్ఎన్ఆర్ వరి రకం ఆరంభ దశలోనే నేలకొరిగింది. వరి వంగడాలలో అతి మృదువైన పంటగా పేరు ఉన్న ఆర్ఎన్ఆర్ 15048 వరి రకానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అయితే ముంపు ప్రాంతాలు, భారీ వర్షాలకు ఈ వరి వంగడం తట్టుకోలేదని శాస్త్రవేత్తల అభిప్రాయం. వరి వేయదలచుకున్న రైతులు నవంబర్ 10వ తేదీ నుంచి వేసుకోవాలని వ్యవసాయ అధికారులు చెప్పున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో కేవలం వర్షంపైనే ఆధారపడి వరి పంటలు ఉండటంతో కొందరు రైతులు ఈ ఏడాది ఆర్ఎన్ఆర్ వరి రకానికి శ్రీకారంచుట్టారు. అక్టోబర్ నెలలో మెట్ట రైతులు వేసిన ఈ వరిపైరు కంకు ప్రారంభ దశలోనే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నేలకొరగడంతో రైతులకు భారీనష్టం వాటిల్లింది. ఈ మేరకు చిట్టమూరు మండలంలోని దరకాస్తు తదితర ప్రాంతాల్లో వేసిన ఆర్ఎన్ఆర్ వరిరకం పూర్తిగా నేలమట్టం కావడంతో రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. సహజంగా కంకి పాలుపోసుకున్న దశలో నేలకొరిగే ఈ వరిరకం, ఈ ఏడాది వరుస వర్షాలు, తుపాన్ల తాకిడితో ప్రారంభ దశలోనే నేలకొరగడంతో తమ దిగుబడులు భారీగా తగ్గడంతో పాటు వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు కూడా చేతికందవని దరకాస్తు గ్రామ రైతులు వాపోతున్నారు. సుమారు 50 ఎకరాల్లో ఈ వరి రకం సాగు చేసిన రైతులు ప్రస్తుతం ప్రభుత్వం ఆదుకోవాలని ఎదురు చూపులు చూస్తున్నారు.

## విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాట / -వైకాపా నేత నేదురుమల్లి హరిచంద్రారెడ్డి

కోట,డిసెంబర్ 23 ప్రభాతవార్త : రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంచడంపై తిరుపతి జిల్లా వైకాపా యవజన కార్యదర్శి నేదురుమల్లి హరిచంద్రారెడ్డి మండిపడ్డారు. ఆయన సోమవారం కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెంలో తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు.రాష్ట్ర ప్రజలపై ఎకంగా రూ 15.485 కోట్ల భారాన్ని మెపడం దుర్మార్గమన్నారు. చార్జీల పెంపునకు నిరసనగా వైస్సార్ సీపి అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు ఈ నెల 27 న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో తల పెట్టిన వైఎస్సార్‌సీపి పోరుబాట కార్యక్రమాన్ని జిల్లాలోకి వైకాపా శ్రేణులు విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. గతంలోనూ విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలను అనేక కష్టాలకు గురి చేసిన చరిత్ర చంద్ర బాబునాయుడుదేనన్నారు.

గతంలో విద్యుత్ తీగలపై బట్టలు అరవేసుకోవడానికి అని ఆయన హేళన చేశారని గుర్తు చేశారు. ఈ నెల 27 న తల పెట్టిన నిరసన కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజల మద్దతు తెలపడంతో పాటు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఆయన వెంట సర్పంచ్ బందిల ప్రసన్న తదితరులు ఉన్నారు.

## సత్వరమే భూ సమస్యల పరిష్కారం : తహశీల్దార్




వెంకటగిరి, డిసెంబర్ 23 ప్రభాతవార్త : రెవెన్యూ సదస్సులో సత్వరమే భూ సమస్యలు పరిష్కరిస్తామని తహశీల్దార్ రాంబాబు తెలిపారు. మండలంలోని కలవలపూడి గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 88 మంది పట్టాదారు పాస్ పుస్తకాలు కావాలని సాగు చేసుకున్న భూములకు పట్టాలి ఇవ్వాలని తదితర సమస్యలపై వినత పత్రాలు అందజేసినట్లు తెలిపారు. రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమోళిరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వాలు జరిగిన తప్పిదాలను ఇప్పుడు సరి చేస్తున్నట్లు వివరించారు. స్పెషలాఫీసర్ దేవి ప్రసాద్‌రావు, సర్పంచ్ బత్తలయ్య పాల్గొన్నారు.

## గృహాలను త్వరలో లబ్ధిదారులకు అందజేస్తాం: ఎమ్మెల్యే



వెంకటగిరి, డిసెంబర్ 23 ప్రభాతవార్త : టిట్కో గృహాలను పూర్తి చేసి త్వరలో లబ్ధిదారులకు అందజే స్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. టీట్కో గృహాలు పనులను ఆయన పరిశీలించారు. గత వైసిపి ప్రభుత్వం గృహాల పనులను పూర్తి చేయకుండా ఆపివేసినట్లు తెలిపారు. త్వరలో అన్ని గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. ఇప్పుడు నివాసం ఉంటున్న వారికి ఇక్కడ సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని తెలిపారు. పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లారు. అధికారులతో చెప్పి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

## ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు తప్పనిసరి : సీఐ




వెంకటగిరి, డిసెంబర్ 23 ప్రభాతవార్త : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు వాడాలని సిఐ ఏవి రమణ తెలిపారు. హెల్మెట్ల వాడకంపై పట్టణ పురవీధుల్లో విద్యార్థులతో కలిసి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్లు ధరిస్తే ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం నుండి బయటపడతారని తెలిపారు. ద్విచక్ర వాహనం వెనక కూర్చున్న వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని తెలిపారు. ట్రాఫిక్ నిర్బంధంలో పాటించని వారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. కొత్త ట్రాఫిక్ నిబంధనలు కూడా వచ్చాయని వీటి ద్వారా జరిమానాలు ఎక్కువగా విధించడం కేసులు పేటడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సుబ్బారావు, కామినేని గోపి, శివ శంకర్‌రావు పాల్గొన్నారు.

## పెట్టుబడి తగ్గించి అధిక లాభాలు పొందాలి




వెంకటగిరి, డిసెంబర్ 23 ప్రభాతవార్త :రైతులు వ్యవసాయ రంగంలో పెట్టు బడులు తగ్గించి అధిక లాభాలు పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ శ్రీనివాసరెడ్డి రైతులకు సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం, వెంకటగిరి నందు కిసాన్ దివస్ (జాతీయ రైతు దినోత్సవం) కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ ంలో పెట్టుబడి తగ్గించుకొని ఆదాయాన్ని పెంచుకొనే మార్గాలను విశ్లేషించాలి సూచించారు. రైతు ఉత్పత్తి దారుల సంఘాలుగా ఏర్పడి అభ్యుదయ రైతులుగా ఎదగాలని, అలాగే కేవీకే నందు చేపడుతున్న కార్యక్రమాలపై వివిధ విభాగాల శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు బి. విజయశ్రీ, డి.తిరుపాల్, పి.నాగార్జునరెడ్డి మరియు రైతులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

బాలాయపల్లి, డిసెంబర్ 23 ప్రభాతవార్త : వెంకటగిరి సీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 2 అంగన్వాడీ కార్యకర్తలు, 11 ఆయా పోస్టులకు జనవరి 6 లోగా దరఖాస్తు చేసుకోవాల నీ సిడిపిఒ శంషాద్ బేగం తెలిపారు. స్థానిక వివాహిత మహిళలు మాత్రమే అర్హులు. కనీసం 10వ తరగతి పాసై 21సంవత్సరాల నుండి 35సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని చెప్పారు. అర్హతలు కలిగిన వారు ఐసీడీస్ వేంకటగిరి ప్రాజక్టు నందు దరఖాస్తు చేసుకో వాళని కోరారు.

## పామంజిలో చోరీ

వాకాడు, డిసెంబర్ 23 ప్రభాతవార్త : వాకాడు మండలం పామంజి గ్రామంలోని రొయ్యల చెరువుల వద్ద ఆదివారం రాత్రి చోరీ జరిగింది. స్థానికుల వివరాల మేరకు పామంజి గ్రామానికి చెందిన ఆదిశేషారెడ్డి అనే ఆక్వా రైతుకి సంబంధించిన ఆక్వా చెరువుల్లోకి రైతు లేని సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి షెడ్ తాళాలు పగలగొట్టి ఆక్వా పరికరాలు ఎత్తుకెళ్ళారు. అందులో రెండు విలువైన విద్యుత్ మోటార్లు, 1 స్టాటర్, 10 ఏరియేటర్ వైర్లు చోరీకి గురైనాయి. సోమవారం ఉదయం గమనించిన ఆక్వా రైతు లబోదిబోమంటూ వాకాడు పోలీసులకు సమాచారం అందించారు.

## మాదక ద్రవ్యాలపై అవగాహన కలిగివుండాలి : సిఐ



నాయుడుపేట, డిసెంబర్ 23 ప్రభాతవార్త : సమాజంలో యువత మాదక ద్రవ్యాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగివుండాలని నాయుడుపేట ప్రొబిషన్-ఎక్సైజ్ సిఐ అరుణకుమారి తెలిపారు.ఆమె ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ డిగ్రికళాశాలలో చదువుతున్న విధ్యార్దులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిఐ అరుణకుమారి మాట్లడుతూ విద్యార్దులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. నాయుడుపేట- పెళ్ళకూరు-ఓజిలి మండలాల్లో అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు చేపటడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో గూడూరు టాస్క్‌పోర్స్ సిఐ బాలకృష్ణ,ఎస్సై గంగాధర్,విద్యార్థులు,పోలీసు సిబ్బందితదితరులు ఉన్నారు.

## ప్రతి ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటాం : ఎస్పి

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 23 ప్రభాతవార్త : చట్టపరంగా ప్రతి ఫిర్యాదు పైచర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పి సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నాడు జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమ ంలో ఫిర్యాదు చేసి స్టేషన్‌కు వెళ్లి కూడా సరైన పరిష్కారం జరగని ఫిర్యాదుదారులకు భరోసా కల్పించి వారికి తగిన న్యాయం చేసి తక్షణమే పరిష్కరించాలననే ముఖ్య ఉద్దేశంతో ఎస్పీ కార్యాలయంలో నిర్వహిం చిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో జూమ్ ముఖాముఖి కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి బాధితులు నేరుగా సంబంధపడిన స్టేషన్ అధికారులతో మాట్లాడే విధంగా ఏర్పాటు చేశారు. తద్వారా అధికారులను కేసు వివరాలను అడిగి తెలుసుకొని బాధితుల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఎస్పీ కార్యాలయానికి వచ్చిన వారి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, ఎంతో ప్రయాసపడి న్యాయం జరుగుతూంది అనే ఆశతో తీరని కష్టం ఉంటేనే ప్రజలు ఎస్పీ కార్యాలయానికి వస్తారని, ఈ ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. స్టేషన్‌కి వెళ్లి పరిష్కారం కలగలేదని, మరలా ఎస్పీ కార్యాలయానికి ఫిర్యాదుదారులు వస్తే అధికారుల బాధ్యతారహితంగా భావించి చర్యలు తీసుకుంటానని అన్నారు. ప్రజల నుండి జిల్లా ఎస్పీ కార్యాలయానికి 65 ఫిర్యాదులను వచ్చాయి వాటిని సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం అందించి సకాలంలో విచారించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు వారికి సంబంధపడిన పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చునని ఆ ఫిర్యాదులను కూడా ప్రజా సమస్య పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణిస్తామని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బ రాయుడు జిల్లా ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రావిమనోహర ఆచారి శాంతి భద్రతలు, నాగభూషణం క్రైమ్ పాల్గొన్నారు.

## జడ్పీ పాఠశాలకు భద్రత కరవు

**- పి.కొత్తకోట హైస్కూల్‌ను పట్టించుకునే నాధులు ఎవరు!**

**- సెలవురోజైతే మందుబాబులు, పేకాటరాయుళ్ళు మకాం**



పూతలపట్టు, డిసెంబర్ 23 ప్రభాతవార్త: పల్లె ప్రాంతాల్లో సరస్వతి నిలయాలుగా ప్రఖ్యాతిగాంచిన ప్రభుత్వ, జడ్పీ ఉన్నత పాఠశాలలు కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి పాఠశాలలను స్థానికులు భ్రష్టు పట్టిస్తున్నారు. విద్యార్థులను రేపటి పౌరులుగా తీర్చిదిద్దడానికి వారం రోజుల పాటు అక్కడ విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులు, సిబ్బంది శ్రమిస్తుంటే, సెలవు రోజుల్లో వీరి శ్రమను వృధా చేస్తూ పాఠశాల ఆవరణలోనే మందుబాబులు, పేకాటరాయుళ్ళు తిష్టవేసి సరస్వతి నిలయంగా ప్రఖ్యాతి గాంచిన పాఠశాలలను నాశనం చేస్తున్నారు. పూతలపట్టు మండలం పి.కొత్తకోట జడ్పీ ఉన్నత పాఠశాల పరిస్థితి ఇదే కోవకు చెందినది. ఈ పాఠశాలలో ప్రస్తుతం 3 నుండి 10వ తరగతి వరకు 250 మంది విద్యార్థులకు పైగా విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. పాఠశాలకు ప్రధాన ద్వారంకు కనీసం గేటు సైతం లేకపోవడంతో పాఠశాల సెలవు రోజులు, రాత్రి సమయాల్లో ఎవరు పడితే వారు పాఠశాలకు వెళ్ళడం, అక్కడే తిష్ట వేసి పేకాట ఆడటం, మద్యం సేవించడం చేస్తుండటం వచ్చిన వారు స్థానికులుగా వుండటంతో అక్కడే స్థానికంగా వున్న ఇతరులు వారిని ప్రశ్నించని పరిస్థితి ఏర్పడింది. పాఠశాలకు సరైన భద్రత లేకపోవడంతో రాత్రి సమయాల్లో దొంగతనం జరిగే అవకాశాలు వుంటాయని దీనిపై అధికారులు దృష్టి సారించి పాఠశాలకు తగిన భద్రత ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే విద్యాశాఖ అధికారులు పి.కొత్తకోట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవసరమైన మౌళిక సౌకర్యాలను కల్పించడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మృత్యుంజయునికి షోడషాభిషేకాలు



శ్రీకాళహస్తి, డిసెంబర్ 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేకాభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. సోమవారం శివయ్యకు ప్రీతిపాత్రమైన రోజు కాబట్టి షోడ షాభిషేకాలు నిర్వహించారు. స్వామికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అబిషేకాలు నిర్వహించారు. అనంతరం పలు రకాల సుగంధ పరిమళపుష్పాలు, గజమాలలు, వెండి నాగాభరణలతో శోభాయమానంగా అలంకరించి ధూప, దీపనైవేద్యాలను మహా మంగళ హారతు లిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.



**సంపద ప్రదీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు:**

మార్కెట్ కమిటీ ఆవరణలో వెలసినయున్న సంపద ప్రదీశ్వరస్వామి వారికి సోమవారం ప్రత్యేక అభిషేకాలు,అలంకరణ చేశారు. భక్తులు ప్రతి సోమవారం అధిక సంఖ్యలో విచ్చేశారు.

## జేసీ ఇలాఖాలో... వారి రూటే సపరేటు

**- ప్రజా సమస్యలను పక్కన పెట్టి ప్రోటోకాల్స్ ప్రాధాన్యత**

**- ఇదేం పనితీరు అని బాధితుల ఆవేదన - చేసేది ఏమీలేక వెనుతిరిగిన వైనం**




తిరుపతి కలెక్టరేట్, డిసెంబరు 23 ప్రభాతవార్త : జేసీ ఇలాఖాలో వారి రూటే సఫరేటు అని అనడం కంటే ఎవరికి వారే యమునా తీరే అన్న చందాన కొనసాగుతోంది ఆ విభాగంలో పనిచేసే క్రింది స్థాయి సిబ్బంది పనితీరు. సోమవారం కలెక్టరేట్ జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొన్ని అని వార్య కారణాల వలన కలెక్టర్ ప్రజావేదిక నుంచి బయటకు వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. అ సమయంలో పూర్తి బాధ్యతలను చూడాల్సిన జేసీ హుటా హుటిన జేసీ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రోటోకాల్స్ కే ప్రాధాన్యత ఇవ్వని జేసీ, ఆ విభాగంలో పనిచేసే కింది స్థాయి సిబ్బంది ఒక సామాన్య పేద, మధ్య తరగతి ప్రజలకు జేసీని కలవడానికి వచ్చే బాధితులకు ఏవిధంగా న్యాయం చేస్తారో అని బాధితులు ఒకరినొకరు మాట్లాడుకోవడం, చేసేది ఏమీ లేక తిరిగి వెనుక వెళ్ళిపోవడం కొసమెరుపు.

## పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్‌కు...రెండు జాతీయ అవార్డులు



తిరుపతి(రవాణ),డిసెంబర్ 23ప్రభాతవార్త: ప్రజాసంబంధాల వ్యాప్తికోసం ఉత్తమ కార్యక్రమాలు నిర్వహించినందుకు పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పిఆర్ఎస్ఐ)తిరుపతి చాప్టర్‌కు రెండుజాతీయ అవార్డులు లభిం చాయి. ఛత్తీస్‌ఘడ్ రాజధాని రాయపూర్‌లోని బాబిలోన్ ఇంటర్నేషనల్ హోటల్‌లో సోమవారం జరిగిన 46వ జాతీయ ప్రజా సంబంధాల సదస్సు ముగింపు కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అరుణ్ సావో ఈ అవార్డులను తిరుపతి చాప్టర్ ఛైర్మన్ కె.శ్రీనివాస రావు, కార్యదర్శి దుద్దేల చంద్రమోహన్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాఠక్, ఉపాధ్యక్షుడు యుఎస్ శర్మ, కార్యదర్శి జనరల్ పిఎల్‌కె మూర్తి పాల్గొన్నారు. కాగా శ్రీనివాసరావుకు పిఆర్ఎస్ఐ ఔట్‌స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ అవార్డు లభించింది. జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ నందకుమార్‌సాయిఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ అవార్డు రావడం పట్ల టిటిడి సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్ఎస్ఐ తిరపతి చాప్టర్ వ్యవస్థాపక ఛైర్మన్ సి.రమాకాంతశర్మ, ఉపాధ్యక్షుడు చంద్రమోహన్ రావు, కోశాధికారి ఆచార్య చక్రవర్తి రాఘవన్, మాజీ ఛైర్మన్లు డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ ఎన్‌బి సుధాకర్‌రెడ్డి, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు ఎన్‌బి హర్షవర్ధన్‌రెడ్డి, కార్యవర్గసభ్యుడు ఆర్‌సికె రాజు హర్షం వ్యక్తం చేశారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కారం : డిఇఇ



తిరుపతి(రవాణ),డిసెంబర్ 23ప్రభాతవార్త: తిరుపతి నగరంలోని వినియోగ దారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సోమవారం నిర్వహి ంచిన విద్యుత్ పరిష్కార వేదిక చక్కగా నిర్వహించామని డిఇఇ వి.చంద్రశేఖర రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి 33/11కెవి రాజీవ్‌నగర్, తోలప్పగార్డన్, ఎలమండ్యం, ఇస్కాన్, ఆర్‌డిఓ కార్యాలయాల్లో నిర్వహించారు.

## గణనాధుని దర్శించుకున్న పలువురు ప్రముఖులు



కాణిపాకం, డిసెంబర్ 23 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈమేరకు తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు నన్నపనేని సదాశివరావు, కర్నూలు జిల్లా కోడుమూరు ఎమ్మెల్యే బి.దస్తగిరిలు కుటుంబ సమేతంగా వేర్వేరుగా సోమవారం కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

## క్రీడల్లో విద్యార్థులకు బంగారుపతకాలు



కుప్పం, డిసెంబర్ 23 ప్రభాతవార్త : తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్‌లో జరిగిన స్పోర్ట్ అండ్ గేమ్స్ మీట్ 2024లో కుప్పం డా॥ వైసి జేమ్స్ ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో బంగారు పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ జగన్నాథరావు తెలిపారు. 13 విభాగాల్లో పోటీపడ్డ తమ విద్యార్థులు 11 విభాగాల్లో 13 పతకాలు సాధించారన్నారు. రన్నింగ్ రేస్‌లో కార్తీక్, జావెలిన్ త్రోలో కార్తీక్, బాల్ బాడ్మింటన్‌లో జట్టు బంగారు పతకం గెలిచిందన్నారు. అలాగే లాంగ్, ట్రిపుల్,హైజంప్ పోటీల్లో షేక్ రోహిత్ రజతపతకాలు సాధించిందన్నారు. చెస్‌లో జగన్మోహన్ రజతంతో పాటు రిలే హార్డిల్స్‌లో కాంస్య పతకాలను విద్యార్థులు సాధించారన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ రమేష్, అధ్యాపకులు సుజాత, శోభనాద్రి పాల్గొన్నారు.

## ఆలసత్వం లేకుండా సమస్యలు పరిష్కారం: ఎస్పీ



చిత్తూరు, డిసెంబర్ 23 ప్రభాతవార్త: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులు సంబంధిత పోలీసు అధికారులు ఆలసత్వం లేకండా పరిశీలించి పరిష్కరించాలని ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్పీ మణికంఠ చందోలు ప్రజల నుండి సమస్యలపై అందిన ఫిర్యాదులను పరిశీలించి క్షేత్ర స్థాయి విచారణ నిర్వహించారు. ప్రజల నుండి అందిన ఫిర్యాదులను చట్ట ప్రకారం విచారణ నిర్వహించి నిర్ధేశించిన గడువులోపు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఆపరేషన్స్ అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు,

## ఇద్దరికి సరే మరో ఇద్దరి సంగతేంటీ! / - నామినేటెడ్ పోస్టులతో కఠారి హేమలత, సిఆర్ రాజన్‌లు హ్యాపీ - పదవుల కోసం కాజూరు బాలాజీ, చంద్రప్రకాష్ ఎదురుచూపు





చిత్తూరు, డిసెంబర్ 23 ప్రభాతవార్త: 2024 అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తూరు స్థానం నుండి తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేయడానికి నలుగురు పోటీ పడ్డారు. వీరందరు పార్టీ కోసం కలసి పని చేయాలని పార్టీ అధిష్టానం ఎవరికి అభ్యర్థిత్వం కేటాయించినా మిగిలిన వారు పార్టీ అభ్యర్థి విజయంకు సంపూర్ణంగా సహకరించాలని భావించారు. ఈ క్రమంలో పార్టీ అభ్యర్థులు ఖరారు కాకముందే చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కలసికట్టుగా నలుగురు నాయకులు కలిసి ప్రచారం చేశారు. అయితే తెలుగుదేశం పార్టీ అధిష్టానం గెలుపే ప్రధానం అనే సూత్రానికి కట్టుబడి అప్పటి వరకు అభ్యర్థిత్వం కోసం ప్రయత్నించిన నలుగురిని ప్రక్కనబెట్టి ప్రస్తుత ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు అభ్యర్థిత్వంను ఖరారు చేసింది. అప్పటి వరకు పార్టీ అభ్యర్థిత్వం కోసం ఆశలు పెట్టుకున్న మాజీ మేయర్ కఠారి హేమలత, బిసీ నాయకులు సిఆర్ రాజన్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కాజూరు బాలాజీ, చంద్రప్రకాష్‌లు పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు ఇచ్చిన మాట ప్రకారం తెలుగుదేశం అభ్యర్థి గురజాల జగన్మోహన్‌నాయుడు విజయం కోసం కృషి చేశారు. రాష్ట్రంలో ఆరు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి రాష్ట్రంలో అధికారం చేపట్టింది. చిత్తూరు నుండి పార్టీ అభ్యర్థిత్వాల కోసం ప్రయత్నించిన బిసీ నాయకులు సిఆర్ రాజన్‌కు అప్పటికే జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి ఇచ్చి సర్దుబాటు చేశారు. ఆపై రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడంతో జిల్లా పార్టీ అధ్యక్షుడిగా విధులు నిర్వహిస్తున్న తనకు పార్టీ అధిష్టానం ఎదైనా మంచి నామినేటెడ్ పోస్టు ఇస్తోందని సిఆర్ రాజన్ భావించారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానం సిఆర్ రాజన్‌ను రాష్ట్ర వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించడంతో ఆయన సంతృప్తి చెందారు.

చిత్తూరు నుండి ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమైన మాజీ మేయర్ కఠారి హేమలతను ఇటీవల చుడా ఛైర్‌పర్సన్‌గా తెలుగుదేశం ప్రభుత్వం నియమించింది. దీంతో కఠారి హేమలత సైతం సంతృప్తి చెందారు. ఇక చిత్తూరు నుండి పార్టీ అభ్యర్థిత్వం కోసం ప్రయత్నించిన కాజూరు బాలాజీ, చంద్రప్రకాష్‌లు మాత్రం ప్రస్తుతం నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే పార్టీ అధిష్టానం వీరిని పట్టించుకుంటుందా! లేదా! చూడాల్సి వుంది. ఇప్పటికైతే కనుచూపు మేరకు నామినేటెడ్ పోస్టుల భర్తీ అనేది వుండదని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. ఒకవేళ నామినేటెడ్ పోస్టుల భర్తీ జరిగితే చిత్తూరు నుండి ఈ సారైనా వీరిద్దరికి పార్టీ అధిష్టానం అవకాశం కల్పిస్తుందా! లేదా! అనేది వేచి చూడాల్సి వుంది.


